ఎగిరే పిట్టలు

ఒకటి-రెండు-మూడు-నాలుగు-అయిదూ-

"వసుంధర" చేతివాచీలోని. సెకన్లముల్లు గిరగిర, అరవయిసార్లు తిరిగింది. బద్ధకంగా నిముషం ముల్లు కాస్త ప్రక్కకు జరిగింది.

ఒకటి-రెండు-మూడు-నాలుగు-అయిదూ-

మళ్లీ సెకన్లముల్లు గిరగిర. అరవయిసార్లూ తిరిగింది మళ్ళీ నిమిషం ముల్లు బద్ధకంగా ప్రక్కకు జరిగింది.

అల్లా పదిహేనుసార్లూ, సెకన్లముల్లు వాచీ వర్తులాన్ని గానుగెద్దులా చుట్టింది. పదిహేనుసార్లూ, నిముషం ముల్లు కాస్త కాస్త జరుగుతూనే వుంది. ఒక్కసారిగా కాళ్ళు తిమ్మిర్లెక్కితే లేచినించోలేం మనం, కొంచెం సరి చేసుకుంటేకాని. అలానే నిముషం ముల్లుకూడా, తన కాలిని కొంచెం కొంచెం సరిచేసుకుంటూంది. నిముషం ముల్లు జరగటంలో బాధ, విసుగు స్ఫుటంగా కనిపిస్తుంది. సెకన్ల

ముల్లు, గిరగిరా తన చలాకీతనాన్ని నిరూపించుకుంటూ తిరుగుతుంది. వీటినాటకాన్ని మౌనంగా చూస్తూ నించున్న పెద్దమనిషి గంటముల్లు, ఏదో చెప్పబోయేలా అసింటా జరిగింది, తను నించున్న చోటుకి కాస్త ఎడంగా.

టప్. టప్. టప్. టప్.........

చప్పట్లవర్షం! ఈ పావుగంటనించీ ఆగటంలేదు. ఒకే లయలో, సైనికుల బూట్ల శబ్దాన్ని అనుకరిస్తో శబ్దిస్తున్నాయి, ఆ చప్పట్లు! అప్పుడే నవరాగమాలిక వర్ణం పాడటం పూర్తిచేసింది వసుంధర! "సంగీత మహల్" ఆవరణంలోని నిద్రగన్నేరు చెట్లమీద పిట్టలు, సంధ్యాకాశం లోకి ఎగురవొచ్చాయి. వాటికి ఆ హాలులోంచి వచ్చే చప్పట్లశబ్దం, పిడుగుపడబోయేముందు గర్జించబోయే మేఘంచేసే శబ్దంలా వినపడింది కాబోల్ను. అరకరకాల పిట్టలన్నీ కిచకిచమంటూ ఎగురుతున్నాయి. మళ్లీ రెమ్మల మీదికివచ్చి వ్రాలుతున్నాయి. కాస్సేపు ఎగురుతూ, కాస్సేపు దొరికిన రెమ్మమీద వాలుతూ, అనిశ్చితతో గల్లంతు పడుతున్నాయి. అందాకా శ్రీచూర్ణరంగులో వున్న ఆకాశం, బూడిదరంగులోకి మారజొచ్చింది. కొన్ని నక్షత్రాలు అక్కడక్కడా నవ్వుముఖాలతో, ఆకసంమీదికి విహారం చేద్దామని రాబోయి, పడమట దిక్కునుంచీ వురకలు, పరుగులుగా వస్తో నీలి జలదాలని చూసి ముఖాలు ముడుచుకొంటూ నీలితెరలోపలికి తప్పుకొన్నాయి. అప్పటి వరకూ సంగీత మహల్‌లోని దీక్షితార్ హాలులో కిక్కిరిసి

వున్న జనానికి చల్లని నీటిగాలి తగలటంతో కాస్త గుక్క తిప్పుకున్నట్లు అయి ప్రాణం సేదదీర్చుకున్నట్లు అనిపించింది. లేత నీలంబట్ట మీద మంచి ముత్యాలతో వీణపాణి "పద్మాసన" అయివున్న వాణీమూర్తి కుట్టబడిన తెరముందు, పద్మాసనంలో కూర్చున్నది వసుంధర స్టేజి ముందర వరసగా అమర్చిన లైట్లకాంతి, ఆమె ముఖంమీదకు సూటిగా ప్రసరిస్తున్నది. కొద్దిగా ముఖం క్రిందికిదించుకుని చేతివాచీ కేసి చూస్తూ ఆలోచిస్తున్నది వసుంధర! వుంటుండీ ఫ్లాష్ బల్బులకాంతి ఆమె ముఖాన్ని మెరిపిస్తోంది ఆమె చెవుల వజ్రాల దుద్దులు, ముక్కునున్న నిమ్మగుత్తి బేసరి, మెడలోని రెండువరసల వజ్రాల అడ్డిగా, ధగధగా, మెరిసిపోతూ తమ యజమానురాలి ఆర్థికోన్నతిని ప్రేక్షకులకు, నిరూపిస్తున్నాయి. భుజంచుట్టూ కప్పుకున్న ఎర్రని జరీగళ్ళ పమిటలోని జలతారుతో అల్లబడిన తామర పూవులు, సూర్యోదయ మయిందా అన్న భ్రాంతితో, వసుంధర మెరిసే చెవుల దుద్దుల వెంపు అనురాగ ప్రేరితంగా చూస్తున్నాయి.

ఆ హాలులో ఆ వాణీ తెరముందు వేదికమీద ప్రసిద్ధ గాయనీ మణులెందరో, ప్రోగ్రాంలు ఇచ్చారు. డి. కె. పట్టమ్మాళ్, యం.యస్. సుబ్బలక్ష్మి, యం. యల్. వసంత కుమారి రాధ, జయలక్ష్మి, టి. టి సీత మొదలగు ప్రసిద్ధ గాయనీ మణుల గానాన్ని, వసుంధర, ఆ హాలులో గేలరీలో ఒక మూలగా వొదిగి కూర్చుని వళ్ళంతా చెవులు

చేసుకుని వాళ్ళ గానంలోని మలుపులనూ మెరుపులనూ, ఆకళించుకునేది. ఆరోజుల్లో సన్నగా, నల్లగావున్న, ఆ అమ్మాయి కానీ, కాస్త ముందు రెండుపళ్లూ ఎత్తుగావుండి ఎవర్ని చూసినా, చిరునవ్వు నవ్వుతూన్నట్లుండే, ఆమె ముఖముద్రకాని ఎవర్నీ ఆకర్షించేదికాదు! ప్రక్కన కూర్చోగానే కల్పించుకుని మాట్లాడి, స్నేహం చేసుకోవాలన్న ఆతృత కలిగించే సౌందర్యం కానీ, కలుపుగోలుతనంకానీ వసుంధరలో లేదనేచెప్పాలి! మూగగా, వింటం తన్లోనే పాటలు అల్లుకుంటూ కూర్చుంటం ఆమెకి అలవాటు! ఆ హాల్లోనే తన బాల్యమంతా మధురమయిన సంగీత ప్రపంచాన్ని వూహిస్తూ గడిపింది. పద్మాసన స్థితులై సంగతులమీద సంగతులు వేస్తూ గానం చేసే, గాయనీమణులు, ఆమెకి సరస్వతీ రూపులుగా కనిపించి, మనస్సులోనే వేయి ప్రణామా లర్పించేది. కొందరు బాలికలుంటారు. వాళ్ళల్లో చొరవ ఎక్కువగా వుంటుంది. వాళ్ళ కభిమానప్రదమయిన విషయాల్ని పదిమందితోటీ చర్చిస్తూ, పదిమంది వల్లా సేకరిస్తూ, మెట్లుమెట్లుగా, చూస్తోండగానే ఎగబ్రాకి శిఖరం అధిరోహిస్తారు. వసుంధరలో, అలాంటి చొరవ లేదు. గానంమీది అభిలాష ఆమెలో అంతర్వాహిని!

ఒక్కగానొక్క కూతురు ముచ్చటకోసం వసుంధర తండ్రి, వైకుంఠం, "అప్పులో అప్పు అర్ధవీశ ఇంగువ" అన్నట్లు వసుంధరకి పద్నాలుగేళ్ళు వచ్చేదాక సంగీతం నేర్పించాడు. వసుంధర మాష్టరు కోదండయ్యగారు,

వసుంధర గాత్రంలోని లాలిత్యాన్ని, గమకాన్ని గమనించారు ఉత్తమగాయని, అయ్యే లక్షణాలున్నయ్యని వంద సార్లు వైకుంఠంగారితో చర్చించారు. వైకుంఠంగారు నవ్వి వూరుకునేవాడు. ఆయనకి కూతురు గాయనీమణి అయి ప్రశంసలు పొందటంకంటె ఆ తవారింటి కోడలై ఫలానా వైకుంఠం గారమ్మాయి, తల్లో నాలుకల్లే మెసలుతుంటూంది, ఆ తవారింట్లో! అన్నకీర్తియే, ముఖ్యం. ఆయన పదహారణాల, నూరుపైసల ఆంధ్రస్త్రీల తండ్రి! అందుకని! అందుకనే——

టం-పం-టం-అంటూ మృదంగం సరిచూట్టం ఆపి అయ్యపిళ్ళ, వసుంధర వేపుచూశాడు. వసుంధర మౌనంగా చేతివాచీకేసి చూస్తూ కూర్చుంటం గమనించాడు! హాలులో చప్పట్ల వర్షానికి జోడుగా హాలుబయటకూడా సన్నని తుంపర మొదలైంది! ఫ్లడ్ లైట్ల కాంతిలో ఆ తుంపర్లు వజ్రపు రవ్వలల్లె మెరుస్తున్నాయి! పావుగంటనించీ మౌనంగా ఆ సంగీతం వింటూన్న ఆమె శ్రవణానందానికి అద్భుత పడ్డారు ప్రేక్షక శ్రోతలు. శక్రటరీ రామానుజం ఇంక వూరుకోలేదు. గీతానికి, గీతానికి మధ్య పావుగంట పావుగంట విరామమైతే కచ్చేరీ పూర్తవటానికి చాలా సమయం అయిపోతుంది. అందుచేత నెమ్మదిగా, "అమ్మా!" అన్నాడు రామానుజం. ఆమెని ప్రకృతంలోకి తేవటానికి ప్రయత్నించటం చూసిన, వయొలినిస్టు పద్మశ్రీ "వడివేలు" కమాన్ వయొలిన్ మీదవేసి గట్టిగా లాగి "జాయ్" మని

పించాడు. అది చూసిన విమాలా దేశికన్, వెంటనే "తంబుర" శృతివేయటం ఆరంభించింది. వసుంధర ఉలిక్కి పడి, రామానుజం వైపు చూసింది.

"ఏమిటి ఏనాన్న చేయమంటారు!" అన్నాడు రామానుజం. "లిస్టు ఇచ్చాను కదా!" అన్నది.

"మీరు ఆలోచిస్తారేమో!" సందేహంగా అన్నాడు రామానుజం.

"నేను సంగీతాన్ని మర్చిపోను రామానుజం! నన్ను నేనే మర్చిపోతుంటాను!"

"అమ్మా!" అన్నాడు రామానుజం మళ్లీ!

"ఆ పిలుపు! అమృతం వర్షించే ఆ పిలుపుకూడా మర్చిపోను. రామా! నా జీవితం వున్నంతవరకూ నువ్వూ సంగీతం, ఇవే నా ప్రపంచాలు. ఇదే నా ఆలయం. నేను ఎగిరే పిట్టను! రామా! ఎగిరే పిట్టకి నీలాకాశం పచ్చని చెట్టూ మాత్రమే జ్ఞప్తి వుంటుంది. మిగతా మనుష్యులందరూ, క్రిమి కీటకాలన్నీ దానికొకటిగానే కనపడతాయి. నాది లోంచి మనది లోకి వెళ్ళకలగటం ఆధ్యాత్మికజీవి ఆశయం రామా! నేను ఆధ్యాత్మిక జీవినికాను, బలవంతంగా ఇందులో ప్రవేశించాను. మళ్ళీ దీన్ని బుద్ధిపూర్వకంగా ఎప్పుడూ వొదులుకోను." ఆమె, రామానుజంతో బహిర్గతం చేయాలనుకున్న మౌన సంభాషణలు ఇవి. పైకిమటుకు మృదువుగా నవ్వి;

"కానీయి!" అంది. రామానుజం లేచి మైక్ ముందు నుంచున్నాడు. అతను అయిదు అడుగుల ఆరంగుళాల పొడుగున్నాడు. స్టేజిమీద ఒకప్రక్కన పొడుగుపాటి మైక్. అతను, వసుంధర పాడబోయే ప్రతీకీర్తనా ఆ మైక్ ముందు నించుని ఎనౌన్స్ చేస్తాడు. వసుంధరని అతను "అమ్మా"అని పిలుస్తాడు. ఆమెతోనే వుంటాడు, తింటాడు, తిరుగుతాడు. సంస్కృత సాహిత్యంతో పరిచయం వుంది. సంగీత సాహిత్యంతో కూడా పరిచయం వుంది. వసుంధర అంటే అతనికి భయం, భక్తీ, ప్రేమ, గౌరవం, ఆపేక్షా, అనురాగం. అతనికి వూహావచ్చింది మొదలు వసుంధరని తప్ప మరే బంధువునీ తెలియదు. ఆమె "ఫలానా వూళ్ళో, ఫలానా బంధువులున్నారు నీకు!" అని ఎప్పుడూ చెప్పలేదు; అతను అడుగా లేదు.

"ఫలానా వూరు వెళ్ళాలి. అక్కడ నాకు బంధువులు వున్నారు" అని ఆమె ఎప్పుడూ చెప్పలేదు. 'మీకు కాని, నాకు కాని బంధువు లెవరూ లేరా?' అని అతను అడగనూ లేదు!

బహుశా అడుగుతే "లేకేం రామా! బోలెడంత మంది వున్నారు. ముఖ్యంగా నీకు నేను, నాకు నీవు ఆత్మ బంధువులం! ఇంక త్యాగరాజస్వామీ పురందరదాసూ, ముద్దుస్వామి దీక్షితులవారూ, మొదలైన వాగ్గేయకారులంతా నాకు దగ్గర బంధువులు. కాళిదాసూ, భవభూతీ, భారవీ, మొదలైన సంస్కృత కావ్యకర్తలంతా నీకు, దగ్గర బంధువులు" అని చెప్పునేమో!

రామానుజం అడగలేదు. తీరిగ్గా తమ వంశ చరిత్ర లని పరస్పరం చర్చించుకుందామన్న కుతూహలత ఇద్దరి లోనూ కలగలేదు! రామానుజం, పెద్దవాడై నప్పట్నించీ అంటే, పదహారేళ్ళు వచ్చేటప్పటికి స్కూల్ ఫయినల్ పూర్తిచేసినప్పట్నించీ, వసుంధర ప్రోగ్రాంస్ డిసైడ్ చేయటం, అడ్వాన్స్ పుచ్చుకుని వాళ్ళకి రశీదులిచ్చి పంప టం, మొదలైన పనులన్నీ చూసుకునేవాడు. కాలేజీ చదు వులు చదువుతానని రామానుజం అడుగనూ లేదు; చదువు కొమ్మని వసుంధర చెప్పనూ లేదు. ఒకళ్ళ మనోగతాల్ని ఇంకొకరు, సులువుగా అవగాహన చేసుకుంటారు వాళ్ళు!

"ఎహెం!" చిన్నదగ్గు విన్పించింది. మైక్‌లో హాలంతా పిన్ డ్రాప్, సైలెన్స్ అయ్యింది.

"ఇప్పుడు పాడబోయేది!" రామానుజం, చెప్తు తున్నాడు! కొన్ని వేల చెవులు వింటున్నాయి.

"భావయామి రఘురామం!" అన్నది స్వాతితిరునాళ్ వారి రచన. రామాయణగాథ! రాగమాలిక!

"స్వాతి తిరునాళ్ వారు పంధొమ్మిది వందల శతాబ్ద ములో తిరువాన్కూరు రాజ్యమును పాలించిన రాజ వంశీ యులు! అనేకానేక భాషాకోవిదులు. వీరి కీర్తనలు తెలుగు, సంస్కృతము, తమిళము, మళయాళము, మణిప్రవాళము అనగా మళయాళ సంస్కృతము, హిందుస్థానీ, మరాఠీ భాషలలో రచించారు. ఈయన ముద్ర పద్మనాభం. ఇంకా

వీరి కీర్తనలే కాక, పదములు, వర్ణములు, తిల్లానములు చాలా ప్రచారములో వున్నయ్.

"భావయామి రఘురామం- అన్నది రాగమాలిక రూపకతాళం, పల్లవి సావేరిలోనూ, బాలకాణ్డ; నాట కురంజి, లోనూ అయోధ్యకాండ, ధన్యాసిలోనూ, అరణ్య కాండ, మోహనలోనూ, కిష్కింధకాండ, ముఖారిలోనూ, సుందరకాండ, పూరీ కళ్యాణిలోనూ, యుద్ధకాణ్డ, మధ్య మావతిలోనూ, పాడబడుతున్నది."

చెప్పటం పూర్తి అయీ కాక ముందే, వసుంధర, సావేరిలో కొద్దిగా, ఆలాపన చేసి పల్లవి ఎత్తుకుంది.

పాడటం అందరూ పాడతారు తొడమీద చరిచి తాళం వేస్తూ, కళ్ళు మూస్తూ తెరుస్తూ ముఖం మూడు వంకర్లు త్రిప్పుతూ, తమ గళాన్ని స్వాధీనంలోకి తెచ్చుకో బోతూ, ప్రేక్షక శ్రోతలికి కూడా వ్యాయామం నేర్పబో తారు. వసుంధర స్థిమితంగా కూర్చుంటుంది. మృదువుగా చేతితో తాళం వేసికొంటుంది. దాని శబ్దం ఆమెకే వినపడ నంత నెమ్మదిగా వేస్తుంది తాళం. తల కొద్దిగా వినమ్రంగా వంచుకుని కదలకుండా పాడుతుంది. కదలకుండానే, ఆమె గళనాదంలో సుళ్ళు తిరిగే స్వరలహర్లకి ముగ్ధులౌతారు, ప్రేక్షక శ్రోతలు. చాలా మందికి సంగీతం అంటే, వినే ఆసక్తి వుంటుంది. అంచేత రేడియోలో విని తృప్తిపడ తారు. కాని స్టేజ్ మీద చూడటానికి అంతగా ఇష్టపడరు. ఏమంటే వాళ్ళు చేసే ఫీట్స్ చూడలేక! వసుంధరలో ఆ లోపం లేకపోవటంవింంచి, గాయనీ మణిగా ఆమె దర్శసీ

యంగా వుంటంనించి శ్రోతలు, ప్రేక్షకులుగా కూడా, వుంటారు. ఆమె కూర్చుని వుండగా ప్రేక్షకులుగా వుండే జనం ఆమెగానం ప్రారంభించేసరికి ఫక్తుశ్రోతలుగా మారి పోతారు. ఆమె గాన ఝురులలో లౌకికులు అలౌకికులుగా, చేతనులు అచేతనులుగా, మారిపోతారు. వారి మనస్సులు సర్వ ఇంద్రియ ఆలోచనల నించీ విముక్తమై, విశిష్టమైన శ్రోతలస్థాయిని అందుకుంటాయి. ఆమె పాడుతూంటే, పవిత్రమైన శారదా మాతగా గోచరమౌతుంది, తప్ప నైలాన్ వస్త్రాలు ధరించే నాగరీక స్త్రీగా గోచరమవ్వదు. ఆమెని చూస్తుంటే పూజ్యభావము కలుగుతుంది తప్ప వేలి కైన ఆలోచన్లు కలుగవు!

ఆమెగానం సాగుతూంది. గేటు కీపర్లుకూడా శ్రద్ధగా వింటున్నారు పవిత్ర రామాయణగాథ. ఒక్కొక్క వాక్యంతో ఒకొక్క చరిత్ర. కళ్ళకు కట్టుతున్నట్లుండే కీర్తన. యుద్ధకాండలోకి వొచ్చింది. మధ్యమావతి రాగంలో పాడుతున్నది వసుంధర. "కలితవర సేతుబంధం-ఖలనిశి చరబృంద దళనం. అతికూర-దశకంఠవిదారం అతి ధీరం,జ్వలన పూత జనకసుతా_సహితమిహ సాకేతం-విలసిత పట్టాభిషేక విశ్వపాలం-పద్మనాభం"

రీను_రిమపనీ_ పమపనిసా_ అంటూ చిట్టస్వరం ఎత్తు కుంది. ఆపయిన అన్ని రాగాల చిట్టలూ కలిపిపాడి ఆఖరున సావేరీలో "గరిసధా-రిసధా-సధా" అన్న చిట్టపాడి భావ యామి అని అందుకునేసరికి హాలంతా మారుమ్రోగి పోయింది చప్పట్లతో.

'వాణీదేవి భూతలానికి దిగివచ్చిందా' అన్నారు కొందరు. స్త్రీలకి ఆనంద బాష్పాలుకూడా వొచ్చాయి.

'ఆమె పాదాలు ముట్టుకుంటే పంచమహా పాపాలు పోతాయ్' అన్నాడు మాణిక్యవేలు అప్పాదొరైతో.

అప్పాదొరై వులిక్కి-పడ్డాడు. మాణిక్యవేలు మళ్ళీ మొదలెట్టాడు.

'లేకపోతే ఎప్పుడూరాని నువ్వుకూడా వచ్చావంటే ఇంకేం కావాలి? ఇవ్వాళ నేను గుర్తెరిగిన ఇన్ని రోజులకి నువ్వు అయిదు రూపాయిలు ఖర్చుపెట్టి సంగీతసభకి వచ్చావంటే, అంతకన్నా ఇంకేంకావాలి? ఇదంతా తప్పక వసుంధర గాత్రమహిమ అయివుంటుందనుకోనా? సర్వ ప్రపంచాన్ని సమ్మోహన పరిచేది వసుంధర గానం కాదేమిటి?' తన్మయంగా చెప్పుకుపోతున్నాడు మాణిక్యవేలు. అప్పాదొరైకి వళ్ళంతా చీపురుముళ్ళు గుచ్చుతున్నట్టు అనిపించింది. స్టేజిమీద వసుంధర కాస్తంత తలెత్తి ఎదరకు చూసినప్పుడల్లా తన్ను చూసిందేమోఅన్న అనుమానంలో పడ్డాడు అప్పాదొరై.

అప్పాదొరై, గానకళా కోవిదుడు కాడు.

అల్లాకాదని నగరంలోని ప్రముఖ వాణిజ్యదూకాడు. కేవలం మందలో కలిసిపోయే గొర్రెపోతు. అతనిలోని వీరరసం చైనావాళ్ళు మన సరిహద్దులమీద, దురాక్రమణ చేసేరన్న వార్త విన్నప్పుడు, వుప్పొంగక పోయినా, వుదయాన్నే తొమ్మిదింటికల్లా చూడికుడుత్తమ్మ అప్పడాలు

కాల్చి సాదం విస్తర్లో పరిమాత్యం చేయక పోయేసరికి బుస బుస లాడుతుంది.

అతనిలోని శృంగారరసం, అతని హృదయాంతర్గత రక్తనాళాల్లోఅంతర్వాహినిగా, ప్రవహించాల్సిందే! ఏమంటే అతను ధరించే, పందలపాక పంచెలూ, లాల్చీలూ, పైరు చెప్పులా వుండే అతని ముఖమూ, నెత్తిమీద అంగుళం ఎత్తుగా నించుండే అతని జుట్టూ, ఏకాలేజీ అమ్మాయి హృదయ వీణనీ శృతిజేయనీయవు! ఇంక భార్యా రత్న మయిన చూడికుడు త్రమ్మ, స్వతహాగా అందమయినదైనా, వయసు మీరని చిన్నదికాదు. అయినా అప్పాదొర్లై;

'అద్దిర కులుకులు, బెళుకులు
నిద్దపు మెఱుంగు దొడలు నీటులు గంటే,
దిద్దుకునే వీలవచ్చును'

"ముద్దియ యీ వృద్ధనారి ముచ్చట దీరన్" అని చదువుతే, ఒక్కసారి ముఖమంతా గంట్లు పెట్టుకొని, "సిగ్గు లేకపోతేసరి ముఖానికి? పూర్వం రాజులైనా వుండే వారు, మీలాంటి పైత్యకారి, కవిత్వాల్ని భేష్ భేష్ అంటూ మెచ్చుకుని, అక్షరలక్షలు ఇచ్చేటందుకు. ఇప్పుడో రోడ్డుమీద చదివేరంటే, ఎవరైనా రోడ్డుసైడు రోమియో లనుకొని, మేజస్ట్రేట్‌కి అప్పగిస్తారు. ఎంత తెలుగు ట్యూట రయినా, అలాంటి రసగుళికల్ని భద్రంగా నోరెత్తకుండా మింగటం అలవాటు చేసుకోండి" అని గదమాయిస్తుంది, అయిదుగురాడపిల్లల తల్లి అయిన చూడికుడు త్రమ్మ!

ఇంక భక్తిరసం అంటే అతనికి భయం. సాధారణంగా మనవాళ్ళు భయం, భక్తి అని జత చేస్తూంటారు. అంటే భయంనుంచి భక్తి ఉత్పన్నమవుతుందని మనవాళ్ళ భ్రమ. అది నిజంకూడానూ. పరీక్షలుబాగా వ్రాయనివాళ్ళు పాసవ్వమేమో అనే భయంనుంచి భక్తులుగా మారుతారు. ఇల్లానే పిల్లలు కలగనివాళ్ళు- అంటే వివాహమయిన మొదటి రెండు మూడు సంవత్సరాల్లోనూ, పిల్లలు కలగకపోతే, యిక పిల్లలు కలగ రేమో అనే భయంలోంచి, భక్తులుగా మారుతారు. ఇలానే రకరకాల భయస్తులు, రకరకాల భక్తులుగా తయారవుతున్నారు. భయస్థులు అంతా భక్తులే. అలా అయితే అప్పాదొరైకి ఏ భయంలేదా?- అన్న ప్రశ్న సహజంగానే రావొచ్చును. అతనికి భక్తిలేదు కాని భయంవుంది. ఎప్పటికైనా ఆ భయంలోంచి భక్తి వుద్భవించదా అనుకోవచ్చును. ఫరవాలేదు. భక్తిలోంచే ముక్తి ప్రాప్తించటం కాకుండా, రక్తిలోంచికూడా ముక్తి లభిస్తుందికదా! గాఢానురక్తుడైన బిల్వమంగళుడు ముక్తుడుగా మారలేదా? అయినా అప్పాదొరై భయానికి కల కారణం వివరించక పోవటం న్యాయంకాదు. చూడీకుడుత్తమ్మ ప్రతి శుక్రవారం భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తుంది. ఆమె నగర "యతిరాజ మహిళామండలి" లో మెంబరు. "వైష్ణవి" పూజ చేసిందంటే ఆరోజు, ప్రైమ్‌మినిష్టరుకి డిన్నరు ఇవ్వొచ్చును అనుకుంటారు చాలా మంది. కాని ఆరోజు అప్పాదొరై లంఖణమే చేయాల్సొస్తూండన్నది చెరగని సిరాముద్ర!

ఏమంటే ప్రొద్దుట కాలేజీ వేళకి చూడికుడు త్తమ్మ అభ్యాం గన స్నానము పూర్తవదు. ఒంటిగంటకి ఇంటికొచ్చేసరికి పొంగలి వుడుకుతూంటుంది! సాయంత్రం ఇంటికొచ్చేసరికి నూతి చప్టామీది గిన్నెలు తళతళా మెరిసిపోతూ అప్పా ద్రొరైని చూసి వెర్రినవ్వు నవ్వుతాయి.

అదేమంటే 'శుక్కురారం పూటా, మిగులూ, తగులూ, తినగూడదు మగాళ్ళు. అందుకనే మనబతుకులిలా బండలౌతున్నాయి. సాయంత్రం ఏదైనా ఫలహారం చేస్తా లెండి' అంటుంది, గోదాదేవి అంశను తనలో విలీనం చేసు కున్న చూడికుడు త్తమ్మ! అందుకని భక్తిరసం అన్నది పడదు అప్పాద్రొరైకి. ఇంతకీ అతనిది రసచేతనకాదు! నీరస చేతన! శృంగార, వీర, భక్తి రసాల్ని అంతర్లీనం చేసు కున్న గానరసానికి అతను ముగ్ధుడెందుకవుతాడు? కాకూ డదు న్యాయంగా! అయితే అతడు తన సంపాదన, సంసా రపు జరుగుబాటుకే, చాలీచాలనట్లుండగా, అయిదు రూపా యలు ఖర్చుపెట్టి విలాసంగా గానసభ కెందుకొచ్చినట్లు? రెండు కుంచాల బియ్యం వచ్చునే! నాలుగురోజుల గ్రాసం నిర్విఘ్నంగా గడిచిపోవునే! ఇంతటి అపచారాన్ని దుర్వ్య యాన్ని ఆడపిల్లలతల్లీ, అందగత్తె అయిన చూడికుడు త్తమ్మ ఎలా భరించేట్లు?

అతను రావటాన్ని, అయిదు రూపాయలూ, ఖర్చు చేయటాన్ని చూడికుడు త్తమ్మ భరిస్తూంది; ఎందుకంటే! తంబురా శృతిచేస్తూ, మధ్యమధ్య వసుంధర మందరంలో పాడుతున్నప్పుడు, తను తారస్థాయిలో ఒకోముక్క

అంటున్న విమలా దేశికన్ చూడికుడు త్తమ్మ పిన్నతల్లి కూతురుకనుక, అదీకాక పద్మశ్రీ వడివేలు, తను ఇంటి ప్రక్కనున్న, మాణిక్యవేలుకి అన్నయ్యకనుక.

ముఖ్యంగా అప్పాదొరై, పెళ్ళిరాతీలని శాసించింది చూడికుడు త్తమ్మ; ఎందుకనంటే ఇరవయి ఏళ్ళ క్రితం, అప్పాదొరై వసుంధరమెళ్లో పచ్చని కొబ్బరాకులపందిరి క్రింద మూడు ముళ్ళూవేయటం తనకింకా గుర్తువుంది కనుక! అన్నిటికన్నా ముఖ్యం, తను అయిదుగురాడ పిల్లల తల్లి. పెద్దపిల్ల నాయకి ఎదిగి కూర్చుంది. ఇంట్లో కాసీనిలవ లేదు. వసుంధర తన భర్తకి భార్య అయిన వసుంధర, వేలు సంపాయిస్తోందంటే తను ఎదుగుతూన్న ఆడపిల్లలకి సరయిన బట్టలు లేక, సదుపాయాలు చేయలేక, వుండీలేక కాలక్షేపం చేయవలసిరావటం, ఆమెకి అసంబద్ధంగా, అసహజంగా అసహ్యంగానూ కనుపించింది కనుకా.

ఆరోజు, ఆ రాత్రి, ఆ విధంగా, అప్పాదొరై అనధికార దేహం గేలరీలో ఒకమూలగా మాణిక్యవేలు ప్రక్కగా కూర్చోబడింది.

ఆకాశం ఆనందంతో జలదరించింది! మేఘాలు జడుసుకున్నట్లు పరుగులెత్తుతూన్నాయి. ఎగిరేపిట్టలన్నీ పన్నీరు వర్షంలో తడిసిపోయి, చీకట్లరెమ్మల్లో. ముక్కులను పొట్టల్లో దాచుకుని బుద్ధిగా కూర్చున్నాయి. వాటిబుద్ధిమంతతనానికి మేఘరాజు మురిసిపోతూ అప్పుడప్పుడు మెరిసిపోతున్నాడు. వసుంధర రామాయణగానం పూర్తిచేసింది. ఎదరకు చూసింది; పరిచితా పరిచిత ముఖాలలో మెచ్చి

కోలు కన్పించింది. ఈ వేదిక తనకు పూజా వేదిక! తన ఆరాధ్య దేవతలు, కూర్చుని, పాడిన ఈ పీఠంపై తను కూర్చుని పాడుతోంది? తను ఆ స్టాండర్డ్‌లోకి వచ్చిందో లేదో తనకి తెలియదు. ఇప్పటికీ ఆనాటి గాయనీమణుల వరసలో తనని చేర్చి, పిలిచిఁతే తను ప్రోగ్రాం ఇవ్వరు. ఏదో జీవికకు ఉపాధిగా, నేర్చుకొన్నది తను! తను, నేర్చిన విద్య నలుగురు బాలికలకు చెప్పి పొట్ట గడుపుకోవాలనే వాంఛ తప్ప గాయనీ మణిగా, సరస్వతీ పీఠం ఎక్కగలనని కానీ, ఎక్కాలని కాని తను అనుకోలేదు! జీవిత ధ్యేయంగా నాదబ్రహ్మను ఉపాసించే గాయకుల పాదాలమీద పడితే కానీ తన జీవితం తరించదు. అలాంటిది ఎలావచ్చిందో; పేరు వచ్చింది. ఆ పేరు పైకి పైకి పోతూంది, ఎగిరేపిట్టలా! అంతంలేని అనంతంలోకి పోతూంది. ఎగిరేపిట్టని చూసి, మిగతా పిట్టలు కూడా ఎగురుతాయి! నేలబారువ దొరికిన గింజలేవో తిని తృప్తిగా వుండే పిట్టలుకూడా ఎగిరే పిట్టలని చూసి ఆకాశం మీదకు ఎగురుతాయి. మెగిరేపిట్ట తనని అనుసరించే పిట్టల్ని చూసి, గర్వం పెంచుకుంటుంది. అహంభావంతో తన ఉన్నతిని చూపాలనే, గొప్పతో యింకా పైకి యింకాపైకి యెగురుతూంటుంది. వీటికి అంద కుండా చివరికి తను వెళ్తూన్న శూన్యం పురోగమనానికి చిహ్నమో, తిరోగమనానికి చిహ్నమో తెలుసుకోకుండా కాలగర్భంలో కలిసిపోతుంది. వసుంధరికి అన్ని వేల ముఖా ల్లోనూ భర్తముఖం కన్పించలేదు. 'వొచ్చివుండరు' అను కుంది. ఎందుకని రావాలి? అన్న ప్రశ్న ఆమెలో కలిగింది.

'ఆయన కెప్పుడూ పాటంటే సరదాలేదు! సరదావుంటే మటుకు తన వెనకాతల తంబురా శృతివేస్తూనో ప్రక్కన మద్దెల వాయిస్తూనో కూర్చుంటారా!"

వసుంధరకి తన చిన్నతనం ముఖ్యంగా పెళ్ళిచూపుల తతంగం స్ఫురణకు వొచ్చింది.

వసుంధర తండ్రి వైకుంఠంగారు ఎంతో సంబర పడ్డారు, అప్పాదొరై లాంటి అల్లుడు దొరికినందుకు! పెళ్ళి నాటి అప్పాదొరైకి ఇరవయి ఏళ్ళు. తెలుగుగ్రూప్‌తో బి. ఎ. ఫస్ట్‌క్లాసులో ప్యాసయ్యి కాలేజీలో ట్యూటర్‌గా వర్క్ చేస్తున్నాడు. తల్లికి ఒక్కడే కొడుకు.

పెళ్ళి చూపులు చూసుకునేందుకు, జ్ఞానమణి, అప్పాదొరై వొచ్చారు. తతంగమంతా అయ్యాక, వసుంధ రని పాటపాడమన్నారు.

"ఒకమాట ఒక బాణము" హరికాంభోజిరాగ కీర్తన త్యాగరాజుల వారిది పాడింది వసుంధర. ఆనందపడి పోతున్నట్లు తలలూపారు. వసుంధర అక్కడే పొరపాటు పడింది. తన అత్తగారికీ భర్తగారికీ కూడ సంగీతాభిరుచి వున్నదనుకొంది. కాని తనది పొరపాటు అనికాపరానికొచ్చిన మూడో రోజుకి తెలిసింది. అయినా ఆమె తన సంగీతం, సాధకం చేసుకోవటం, అపుకోవాల్సి వొచ్చినందులకు చింతించలేదు. 'పితా రక్షతి కౌమారే, భర్తారక్షతి యౌవనే' అనే సూక్తి ఆమె ఆచరించ దలచుకుంది. అత్తవారింటో కాపరం చేసిన మూణ్ణెల్లు వసుంధర 'సా' అంటే వొట్టు!

పతియే ప్రత్యక్షదైవము అనుకునేది. అప్పారావు కైనా, ప్రత్యక్ష దెయ్యములా ప్రవర్తిస్తే కూడా ఆమె పన్నెత్తి మాట్లాడకుండా భరించేది. పతిభక్తే సతికి చిరంతన ముక్తిప్రదాయిగదా మరి! అంతటి మిథిలేశ్వర తనయ, అయోనిజమైన, సీతాతల్లికే తప్పని అగ్నిపరీక్ష తనకా తప్పేది? అలాంటి అగ్ని పరీక్ష వసుంధరకీ వొచ్చింది!

వైకుంఠంగారు మూడువేలు కట్నం ఇస్తానని వొప్పుకున్నారు. అన్నప్రకారం వున్న ఇంటిమీద అప్పుతెచ్చి అప్పారావు కిచ్చి పెళ్ళి అయిందనిపించారు. అప్పంటే తెచ్చారుకాని, అదేలా తీర్చాలో అర్థం అవలేదు వైకుంఠంగారికి. నలుగురు కొడుకులున్నారు. వాళ్ళు కాస్తో కూస్తో సంపాయిస్తున్నారు - సంసారాలు జరుపుకొంటున్నారు. తండ్రి అప్పుతెచ్చి వసుంధర వివాహం జరిపిస్తోంటే చూస్తూ వూరుకున్నారు. 'తెచ్చినవాడు తీర్చలేడా? ఎవర్నడిగి చేశాడు అప్పు !" అని గుర్రుపెంచుకున్నారు.

వైకుంఠంగారు అప్పుతీర్చమని కొడుకులని అడుగదల్చుకోలేదు. పెళ్ళిలో వాళ్ళు, వాళ్ళ భార్యలు అనుకునే మాటల్నిబట్టి వాళ్ళకి వసుంధర భవిష్యత్తు గురించి యే బాధ్యతా వుండబోదని గ్రహించేడు. అందుకని ఇల్లు అమ్మేసి అప్పుతీర్చి,తనదారిన తను ఏ పుణ్యతీర్థానికో పోయి చరమదశని, నిశ్చింతగా గడుపుదామను కున్నాడు. అది వసుంధరకి తెలిసింది.

"ఈ పెద్దతనంలో వొంటిగా దేశాలమ్మట వెళ్ళిపోతావా నాన్నా! నలుగురు కొడుకులుండీ" అన్నది. తన

దగ్గర వుంచుకోవటానికి, అత్తగారూ భర్తగారూ అనుజ్ఞ ఇవ్వరని తెలుసును.

"వసూ! 'యస్యాస్తి విత్తం సనరః కులీనః సపండిత స్స శ్రుతవాన్ గుణజ్ఞః' అన్నది మర్చిపోయేవా? అప్పు తీర్చటానికి ఇల్లు అమ్మేయాలి కద! ఇంటిమీద వచ్చే నల భైయు రూపాయిల ఆదాయంతో, నా జీవనం గడవటం కష్టమైపోతూంది కదా! ఇల్లు అమ్మేస్తే ఆ ఆదాయంకూడా వుండదు. ఇల్లంటూ వుంటే ఏ కొడుకుకయినా మాకిస్తా డంటే, మాకొస్తాడనే ఆశకలిగి నన్ను దగ్గర అట్టిపెట్టుకుం దురు. ఏమూళాలేని ఏమీ ఇల్లులేని నిర్ధనుణ్ణి నన్ను ఎందు కని పోషిస్తారువాళ్లు?"

"నువ్వు పెంచి, చదువు చెప్పించి వాళ్ళ జీవితాల కో దారి ఏర్పరిచి నందు కిదేనా ప్రతిఫలం?" వసుంధర దుఃఖంగా అన్నది.

"ప్రతి ఫలాపేక్షతో, తల్లిదండ్రులు సేవనీ చేయరు. అదీ వాళ్ళ కనీస ధర్మం. ఒక జీవిని ఈ ప్రపంచంలోనికి తీసుక రాగానే వాళ్ళ తిండి తిప్పలూ, చదువూ సంధ్యలూ, జీవితా వసరాలూ, చూడాల్సిన భాధ్యత కలుగుతోంది. ఈ బాధ్యత, ఒక్క మానవులకే కాదు. సమస్త ప్రాణికోటి లోనూ ఉత్పన్నమైంది. అదొక సంతోష శ్రమకరమైన జీవ భ్రిమణం. క్రిమికీటకాలూ, పశుపక్ష్యాదులుకూడా ఈ సృష్టి పెరుగుదలకి తోడ్పడు తున్నాయి. పిల్లలని రెక్కలొచ్చే దాక పెంచటమే బాధ్యత! రెక్కలు వచ్చిన పిట్టలు ఎగిరి పోతయ్! పిల్లలు మాత్రిం అంతే ఎందుకు కాకూడదూ?

తల్లిదండ్రులు పిల్లలని పెంచుతారు కాని, పిల్లలు తల్లిదండ్రులని పెంచటం, పెంచవలసి రావటం, ఒక్క మానవుల్లో తప్ప, మరే ఇతర ప్రాణికోటిలోనూ లేదు. నాకు డబ్బులేదు. ఏ కొడుకు దగ్గరుంటే వాళ్ళకే అధికవ్యయం! ఇంకనీవు. నీకు ఆపేక్షవున్నా నీ భర్త కుండాల్సిన పనిలేదు. కొడుక్కు ఆపేక్షుంటే కోడలికుండదు. వుండాల్సిన అవసరంకూడా లేదు. ఈ వృద్ధాప్యంలో నిర్ధనత్వంలో వాళ్ళ సంసారంలో జేరి. కలతలు కలగటానికి కారణం కావటం కంటే భగవంతుని సన్నిధిలో దొరికిన దేదో తింటూ కాలక్షేపం చేయటమే మంచిది. ఇహ పరసాధకం! భక్తి ముక్తి దాయకం. అందుకే మన పూర్వపు రాజులు, యువరాజులకి పట్టాభిషేకాలుచేసి వానప్రస్థాశ్రమానికి వెళ్ళి పోయేవారు."

"నీఇష్టం" అన్నది వసుంధర.

వసుంధరకి "తనఇష్టం" అన్నమాట చెల్లదు అని చిన్నప్పట్నించీ తెలుసును.

"నీ ఇష్టం" అనే అప్పుడొకైని పెళ్ళాడింది.

"నీఇష్టం" అనే తండ్రి నిర్గమనాన్ని మౌనబాధతో హృదయగతి మొనర్చుకున్నది.

"తల్లి గలప్పుడే పుట్టిల్లు! పాలుగలప్పుడే పరమాన్నం" అంటారు. వసుంధరకి ఆ రెండూ లేవు. అది జ్ఞానమణికి లోకువ.

"వాకిట్లో నించోకు! ఎవరన్నా చూసేరు." అనేది. జ్ఞానమణి లోపలికొచ్చేది వసుంధర.

"పోతుల్లాంటి అన్నలున్నారు. ఎందుకూ? వో నా

డన్నా వచ్చిచూడరు. వచ్చి పలకరిస్తే వాళ్ళ మొఖాసాలు దోచుకపోతామా”

“నిజమే మరి” అనుకునేది వసుంధర. నాన్న ఇల్లు తన గురించి అమ్మేశాడు. తనకు పెళ్ళిచేసి తనదారిన తాను వెళ్ళిపోయాడు. ఆ ఇల్లే వాళ్ళకిచ్చేసి తన పెళ్ళి బాధ్యత వాళ్ళమీద పెడితే, ఏమన్నా అభిమానం చూపుదు రేమో! కాని తండ్రి అలా చేయలేదు. అన్నలనించి తన్ని విడదీశాడు. గారాబంగా పెంచారు. చేతులతో పెళ్ళిచే శారు. అంతవరకూ సవ్యంగానే చేశారు. ఆయన అన్నీ స్వయంగా చేయటంతో అన్నలకి తనమీద జెలసీ కలి గింది. ఏ ముఖం పెట్టుకుని వాళ్ళ యింటికి వెళ్ళ కలదు.

“ఇప్పుడు పాడబోయేది” రామానుజం గొంతు మైక్‌లో విన్పించింది. చేతులో కాగితం వెంపు చూసుకు న్నాడు, రామానుజం లిస్టు. వ్రాసిచ్చింది, వసుంధర. ‘తరంగం నారాయణ తీర్థులవారిది, వీక్షేకదా దేవ దేవం, రాగమాలిక, ఝంపెతాళం పల్లవి, ఆనందభైరవి తరువాత వరసగా బిలహరి, సింధూర, బేహాగ్, భైరవి, కేదారగౌళ, రాగాలలో పాడబడుచున్నది’ అని కూర్చున్నాడు రామా నుజం.

వసుంధర ప్రారంభించింది. ‘సాక్షాన్మదనకోటి సౌందర్య భావం– గోపాలమూర్తిం–వీక్షేకదా దేవదేవం–’

వసుంధరకి, రాగమాలికలంటే ఇష్టం. ఎక్కువ ఇష్టం. సాధారణంగా కొంతమంది గాయకులు, భైరవి, ఆటతాళ వర్ణం, ‘విరిబోణి’ పాడతారు. వసుంధర నవరాగ

మాలికవర్ణం పాడుతుంది. తర్వాత అష్టరాగమాలిక 'నిత్య కళ్యాణి' పాడుతుంది. అదీకాక ప్రతి కచ్చేరీలో కూడా, 'వారణమాయిరమ్' (ఆండాల్ స్వప్నం) 'కణ్ణినుల్ శిర్ త్తామ్బ్' పాడుతుంది. రెండుకూడా రాగమాలికలే. మనో హరంగావుండే, ఆ రాగమాలికలు ఆమె పాడకుండా కచ్చేరీ పూర్తిచేయదు. ఇంద్రధనస్సు రంగులు ఎంత మృదువుగా, ఒకదానిలో ఒకటి ఎలా విలీనమవుతూ, నయనానందం కలుగచేస్తయ్యో, రాగమాలికల్లోని రాగాలుకూడ ఒక రాగంలో ఇంకొక రాగం మృదువుగా కలిసిపోతూ శ్రవణా నందం కలుగచేస్తయ్!

రాగం - రంగూ, ఒకటి అదృశ్యం- ఇంకొకటి దృశ్యం. ఒకటి చెవికింపు - ఒకటి కంటికింపు. సంగీతంతో చిత్రకారునికి అవినాభావ సంబంధం వుండితీరుతుంది. సంగీతం హృదయస్పర్శి! ఆ రసస్పందనలేనిదే చిత్రకారుని కుంచెలో కాంతుల రంగుల వెల్లివిరియవు.

"అద్భుతంగా పాడుతున్నారు. కాదూ!"

ప్రక్కనున్న జయలక్ష్మి అనగానే నాయకి ప్రకృతం లోకి వొచ్చింది.

"అవునవును" అన్నది నాయకి. పొరుగింటి అయ్యర్ల జయలక్ష్మికి సంగీతం అంటే భలే పిచ్చి. వాళ్ళక్కడికీ వాళ్ళ వాళ్ళు ఎక్కడికీ పంపరు. నాయకికి సంగీతం అంటే ఇష్టం వున్నా లేకపోయినా పదిమందిలో తిరగటం సరదా. జయ లక్ష్మి సీజన్ టికెట్ మీద నాయకిని తీసుకొచ్చింది. నాయకి

వసుంధర స్టేజ్ మీది లైట్ల వెల్తురులో దేవతావిగ్రహంలా మెరుస్తున్నది. నాయకి వేడిగా నిట్టూర్చింది.

"ఈవిడ తన సవతి తల్లన్నమాట! ఎంత భాగ్యవంతురాలు? ఆవిడ కడుపునే తను పుట్టివుండ కూడదూ? తనకి కూడా చదువూ సంగీతం చెప్పించును. వేలుకట్నంపోసి మంచి హోదాలోనున్న వాణ్ని అల్లుడుగా తెచ్చుకొనుండును! తను దురదృష్టవంతురాలు. కాస్తలో తప్పిపోయింది. ఆమెకూడా ముందు తన తండ్రి వదిలేసి నందులకు, దురదృష్టవంతురాలననే చింతించి వుంటుంది. 'సాధకమున పనులుసమకూరు ధరలోన' అన్నట్లు, ఆమె చేజారిన అదృష్ట రేఖకోసం చింతిస్తూ చేతులు ముడుచుకుని కూర్చోక తన అదృష్టం బయటపడటం కోసం మళ్ళీ ఒక్క ప్రయత్నం చేసింది. ఆ ప్రయత్నం విజయవంతమైంది. ఈతరాక మునిగిపోతున్నవాడు దొరికినదేదో ఆకూ అలమైనా సరే పూతగా పట్టుకుని తేలి ఒడ్డు చేరుకుందుకు ప్రయత్నిస్తాడు! ఒడ్డుచేరుకోవచ్చును. అదృష్టంబాగుంటే, ఫలవృక్షాలతో నిండిన తోట అవ్వాచ్చును. అతను తేలిన ప్రదేశం! దురదృష్టంలోంచి, అదృష్టం పుట్టుక వస్తుంది. చీకటి రాత్రిలోంచి ఉదయమైనట్లు! అసలు రాత్రి చీకటిగా వుంటేకాని ఉదయకాంతి మనస్సుల్ని ఆహ్లాదపరిచేదిగా వుండదు!"

నాయకి ఆలోచిస్తోంది. ఆమె కన్నులు చెమ్మగిల్లుతున్నాయి. తన తల్లికేం మిగిలింది? ఆమె ఏం సుఖపడుతోంది. లేచినది మొదలు - పొయ్యిలోకి- పొయ్యిమీదకు ఎలారా భగవంతుడా అన్న జిజ్ఞాసే అమ్మకి! అంత అంద

మైన అమ్మకి అన్నానికూడా తడుముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది! నాన్న తననేం ఉద్ధరిస్తాడు? నాలుగు ప్రైవేట్లు చెప్పుకుని, పైరాళ్ళు తెచ్చి ఆదాయం వృద్ధి చేసుకుందామన్నా తెలుగు ట్యూటరాయె! తెలుగు సబ్జక్టు యెవరు ప్రైవేటు చెప్పించుకుంటారు? అమ్మకంతకం టెనూ! తను చప్పున స్కూల్ ఫయినల్ ప్యాసయి ట్రయినింగ్ అయితే కాస్త చేదోడు వాదోడుగా వుంటుందిట. తనకి లెక్కలు బాగారావు. రెండుసార్లూ పోయింది. అమ్మకి తనమీద కోపం చదువుమీద శ్రద్ధలేదని. ఇంక ఆపరీక్ష, ప్యాసవ్వటం తనవల్లకాదు. ఎంతకీ తమకి చదువు లంటటం లేదని గోల చేస్తారు. కానీ, పోనీ తగ్గ సంబంధాలుచూసి పెళ్ళి చేద్దామన్న వూహేకలగదు అమ్మకీ నాన్నకీ! తన ఖర్మకొద్ది పరీక్షలు పోవటంకూడా అంతే! పెద్దచెల్లి తంగమణి, హిందీ పరీక్షలు చదవకగదా, అని కట్టింది. రెండో చెల్లి అంబుజం కాస్తనయం! టైలరింగ్ నేర్చుకుంటోంది. బాగా నేవస్తోంది. అమ్మను తలుచుకుంటే జాలీ, కోపంకూడా కలుగుతుంది. అస్తమానూ వంటింటికి అంకితమైపోతోంది. పాపం, నిస్సహాయురాలు. ఎంతనిస్సహాయురాలు కాకపోతే కోరికోరి సవతినియింటికి పిల్చుకురమ్మని ఏ స్త్రీ భర్తని వత్తిడిచేస్తుంది? ఉదయాన్నే. తన తల్లి, తండ్రితో చెప్తూంటే విన్నది నాయుకి. వసుంధర తనకి సవతితల్లి అవుతుందని అప్పుడే తెలిసింది. జయలక్ష్మి అట్టే బలవంతం చేయకుండానే, ఆమె వెంట కచ్చేరికి వచ్చింది.

"ఈమె, తమతో వుంటే బాగుండును" అనుకుంది

నాయక. మళ్ళీ తనలో తనకి శుభ్రమైన బట్టలులేవు. నగల మాట కలలోని వార్త. ఈమె తనందరితో కలిసివుండి తను సంసార సాగరాన్నంతటినీ, ఈదలేకపోతేమానె, కనీసం తననైనా కూడా తీసుక పోతే బాగుండును. ఒక్కొక్క ప్రోగ్రాంకి వెయ్యి మొదలు పదివేలదాకా పుచ్చుకుంటుందట. ఎంత డబ్బు చేసుకుంటుంది! ఆవిడ కూడా వుండి ఆవిడ పాడబోయే ప్రతీ పాటా ఎనౌన్సుచేస్తూండే, ఆ యువకుడెవరో పొడుగ్గా బాగానే వున్నాడు. బహుశా ఆమె అన్నగారి కొడుకయివుంటాడు. పెళ్ళి అయిందో లేదో! ఆ తంబురా శృతివేసే ఆమె ఏమవుతుందో! చుట్టాలయి వుంటారు. 'తెప్పలుగ చెరువునిండిన కప్పలు పదివేలుజేరు' అన్నట్లు ఆమెని అందరూ ఆశ్రయిస్తారు. తనుమాత్రం ఎందుకు ఆశ్రయించకూడదు! తను ఆమెకి సవతి కూతురు కాకపోతే బాగుణ్ణు. ధైర్యంగా వెళ్ళి ఆశ్రయం కోరును. ఈ దిక్కుమాలిన బాంధవ్యంవల్ల తన్ని ఏమని అడగాలా అన్న సంకోచం, కలుగుతోంది. తనదొక వెర్రికాకపోతే, తన్ని అష్టకష్టాలు పెట్టి ఇంట్లోంచి, తన్నితగిలేసిన భర్త కూతుర్ని ఆమె ఆదరిస్తుందా? ఏమో! ఏ పుట్టలో ఏపాముందో ఎవరు చెప్పగలరు! తన్ని చూడగానే, ఆమెలో అభిమానం పుట్టుక రాకూడదా ఏమిటి? అదృష్టంబాగుంటే తన్ని ఆ శక్రటరీ అబ్బాయికిచ్చి పెళ్ళిచేసి, ఇద్దర్ని తనదగ్గరే అట్టేపెట్టుకో వచ్చును. ఇంతకీ ఆ తంబురమ్మాయి, ఆ అబ్బాయి భార్య యితే! అయివుండదు. రెండుజడ లేసుకుంది ఆ అమ్మాయి. పెళ్ళయిన వాళ్ళు రెండుజడ లేసుకుంటారా? అన్నట్టు జ్ఞాపకం

వొచ్చింది. ఆ తంబురమ్మాయి అమ్మకి బంధువులేనట! ఇంటి కెళ్ళాక అమ్మని అడగాలి. ముందు ఈమె ప్రోగ్రాం అవ గానే ఈమెని కలుసుకుని అడగాలి. ముందు ఈమె ప్రోగ్రాం అవగానే ఈమెని, కలుసుకుని ఏదయినా సహాయం చేయమని ప్రాధేయపడాలి!

నాన్న చేసినదానికి, తనేంచేస్తుంది? తను దుర్భర దీనావస్థ ఆమె కరిగిపోయేలా వర్ణించి చెప్పాలి. ఎలానో అలా ఆమెని తను ఇంటికి తీసుకపోవాలి. అమ్మ నాన్నతో చెప్పింది కాని, తనకి నమ్మకం. నాన్న ఆవిణ్ణి బ్రతిమాలుకుని ఇంటికి తీసుక వస్తాడని నమ్మకంలేదు. ఏమయినా మగవాడు కదా! వదిలేసిన భార్యని, ఇవ్వేళ రెండుచేతులా ఆర్జిస్తోం దని ఎలా బ్రతిమాలతాడు? అబ్సర్డ్! అలా చేయడు తన తండ్రి! బియ్యం లేకపోతే, పొరిగింటికెళ్ళి అప్పైనా తేని వ్వాడు! అలాంటిది, ఆమెని ఎలా బ్రతిమాలుతాడు? అమ్మ సాధింపు పడలేక వొచ్చాడంతే! కచ్చేరీ, కాగానే తన మానాన్న తను వెళ్ళిపోతాడు నిశ్శబ్దంగా! అంచేత, ఈమెని బ్రతిమాలి, బామాలి, తమ ఇంటికితీసుకుపోయి అమ్మకి అప్ప చెప్పే బాధ్యత తనమీాద వుంది. ఇంటికివచ్చి, తమఅయిదు గురప్పచెల్లెళ్ళనీ, తల్లినీ చూస్తేఆమెకి, జాలి, తనంతట దేకలుగు తుంది. కలిగి తీరుతుంది. ఆమెది మాత్రం స్త్రీ హృదయం గాదా? స్త్రీని స్త్రీయే ప్రేమించి, ఆదుకోలేకపోతే ఇంక ఎవరు ఆదుకుంటారు? స్త్రీ సహజంగా కరుణామయి! పురు షులకున్న కఠినత్వం, స్త్రీ కుండదు. ఆమె తప్పక తమతో కలిసి తీరుతుంది.

నాయుకి మనస్సు తేలిగ్గా, దూదిపింజల్లేఎగురుతూంది. సంభవా సంభవాలు ఆ పిల్లకి తెలియవు. తన తండ్రికీ, ఆమెకీ, మధ్య యెందుకింత అగాధం కల్గిందో, ఎందుకని, ఆమె వొంటిగా నిస్సహాయంగా ఈ విశాల ప్రపంచంలో పయనించాల్సి వచ్చిందో, ఆ కన్న మనస్సుకి, అర్థం అవదు. వయసుతో కాని, లోక పరిశీలన అలవడదు. కలల నిలయమైన నాయుకి కన్నవయస్సు, వసుంధర గాన స్రవంతిలో తేలిపోతోంది.

టప్ టప్ టప్.........

మళ్ళీ చప్పట్లవర్షం ప్రారంభమయింది. అప్పుడొకరై కునికిపాట్లుపడుతున్న వాడల్లా ఉలిక్కిపడి తిన్నగా కూర్చు న్నారు. పదకొండున్నర! వసుంధర ప్రతి కీర్తనా పూర్తి చేసినప్పుడల్లా సభికులు మైమరచి, ఆదేపనిగా చప్పట్ల వర్షం కురిపిస్తున్నారు. నగరంలోని ప్రసిద్ధగాయక గాయనీ మణులు, ముందు వరుసల్లో కూర్చుని, వసుంధర పాడే ప్రతీ సంగతికీ భేష్ భేష్ అంటూ మెచ్చికోలుగా తలలూపు తున్నారు. గంటన్నరసేపు హనుమతోడిలో రాగం తానం పల్లవి పాడింది. పాట్రన్స్ చైర్సులో కూర్చున్న కొంతమంది సంగీత ప్రియులు చీటీలలో, ఫలానా కీర్తన పాడమని వ్రాసి స్టేజ్ మీదకు వాలంటీర్ చే పంపుతున్నారు.

వాలంటీర్లు, కార్యదర్శి కూడా స్టేజ్ మీదకు వొచ్చి, కొంచెం "పాలు" పుచ్చుకొమ్మని వసుంధరని అడిగారు. వసుంధర వద్దన్నది. ఆమె గానం మధ్యలో ఏమీ పుచ్చు కోదు. రామానుజం వాలంటీరు తెచ్చిన ఒక చీటీనిచూసాడు.

అందులో అమృత వర్షిణి రాగములోని దీక్షితార్ కీర్తన పాడవలయునని కోరబడినది. రామానుజం వసుంధరతో అన్నాడు.

"అమ్మా మీకు ఈ కీర్తన సాధకంలో వున్నదా?"

"లేకేం! పాడుతోంటే అదే జ్ఞాపకాని కొస్తుంది" అన్నది వసుంధర. వడివేలు ఆమెలోని నిర్లిప్తతని గ్రహించాడు. వసుంధర ప్రోగ్రాం ముందర రిహార్సల్ చేసుకోదు. ఆమెకిష్ట మయినవన్నీ పాడేస్తుంది. అపయిన శ్రోతలు కోరిన వేవైనా జ్ఞాపకం వుంటే పాడేసి మంగళం ఎత్తుకుంటుంది అవ్యవధానంగా! ఒక్కసారిశ్రోతలు గతుక్కు మంటారు. బయట చీకటిగా చలిగా వర్షంగావుంది. సభికులు వసుంధర గానం కోసం ఎదురుచూస్తున్నారు. రామానుజం మైక్ ముందర నించుని చెప్పసాగాడు.

"బయట జోలెడు వర్షం కురుస్తున్నది. అయినా సభికులు అమృత వర్షిణిరాగ కీర్తన పాడమని కోరుతున్నారు ఇప్పుడు. 'ఆనందామృత వర్షిణి' అన్న దీక్షితులవారి కీర్తన అమృత వర్షిణి రాగములో పాడుతారు. ముద్దుస్వామి దీక్షితులవారు. పద్ధెనిమిదో శతాబ్దివారు శ్రీ విద్యోపాసకులు. ఈయన నవగ్రహ కీర్తనలు, నవావరణ కమలాంబా కీర్తనలు, మిక్కిలి ప్రసిద్ధి పొందాయి. ఈయన ఎట్టయపురానికి వెళ్ళుతూ, మార్గమధ్యంలో బీటలువారి వున్న నేలలో ఎండి వున్న పైరుని చూసి, ఆకాశము వైపుచూసి, కూడా వున్న శిష్యులకి అమృతవర్షిణి రాగములో ఈ కీర్తనను చెప్పుచుండ,

అంతవరకూ దిన్నగావున్నా ఆకాశంలో ఎక్కణ్ణుంచో పరుగులెత్తుతూ వచ్చిన నీలమేఘాలు, జల్లుజల్లుమని వర్షించ నారంభించాయట! వీరిముద్ర 'గురుగుహ'. ఈయన అన్ని దేవతలమీదను గీర్వాణ భాషలో కీర్తనలు రచించారు" అని చెప్పటం పూర్తిచేసి చేయకుండానే, వసుంధర కీర్తనని ఎత్తుకుంది.

దూరంగా ఠాణాలో, పన్నెండుగంటలు కొట్టటం వినిపించింది. చూడికుడుత్తమ్మకి చటుక్కున మెలుకువ వచ్చింది. నులకమంచంమీద కాస్త ప్రక్కకు వొత్తిగిలి చూసింది. నులక, వంటికి గట్టిగా వత్తుకుంటోంది. నాయకి తప్ప మిగిలిన పిల్లలంతా క్రింద గోనెపట్టా పరుచుకుని పడు కుని నిద్రపోతున్నారు. వాళ్ళని చూసి గాఢంగా నిట్టూ ర్చింది, చూడికుడుత్తమ్మ. నల్లులు తెగ జేరాయి మంచం పట్టెలనిండా! అరటి దూడలాంటి చూడికుడుత్తమ్మ చేతుల నిండా కందిగింజ అంత దద్దుర్లు లేచాయ్! లేచి మంచం నడుంగా కూర్చుంది, చూడికుడుత్తమ్మ. ఆవలించి చిటికెలు వేసింది.

"తండ్రీ కూతుళ్ళు ఇంకారాలేదు" అనుకుంది.

"ఇంతకీ ఆమె నింటికి తీసుక వస్తారో, లేదో! ఆమె వస్తుందా! ఇన్నాళ్ళకి భర్త మళ్ళీ రమ్మంటుంటే రాకుండా వుండగలదా? ఎంత వేలు సంపాదిస్తున్నా భర్తతో వున్న గౌరవం సాటివస్తుందా? ఏమో నరంమీద పుండూ నరమం త్రపుసిరీ అన్నారు. బాగా డబ్బుతో కొవ్వెక్కిపోతూన్న

ఆమెకి ఈ అణాపరక భర్త నీడన వుందామన్న ఆసక్తి వుంటుందా? అదంతా పూర్వకాలం వాళ్ళకి భర్త ఎంత హింసపెట్టినా కిక్కురు మనకుండా వాళ్ళ దయా దాక్షిణ్యాలకోసం తపించి పోతూండేవారు. ఇప్పుడంతా తెనుగు మారి పోయారు. మబ్బు విడిచిన ఎండల్లే, చిటచిట లాడుతూ వెలుగుతున్నారు. ఏ రంగాల్లో చూసినా భర్త వొదిలేసిన స్త్రీ లే! కాస్తయినా లజ్జలేదు వాళ్ళకి! స్త్రీకి లజ్జే అంద మిస్తోందనే వారు పూర్వులు. ఇప్పుడు నిర్లజ్జే అందమిస్తోంది. ఎంత వళ్ళుకనపడేటట్లు గుడ్డలు కట్టుకుంటే అంతఫాషన్ ! అసలు దురదృష్టమంతా తన్ను వరించింది. చిన్నప్పుడంతా బంధువుల్లో చురుకైనది, అందమైనది- అని తను పేరు పడింది. పెళ్ళయిన కొత్తలో, కాలేజీలోని, స్టాఫ్ అంతా తన్ని చుట్టానికొచ్చారు. ఎందుకొచ్చిన అందం? అడుక్కు తిన్న అందం? అందం హాలివుడ్‌లో ఆరణాలకి అమ్ముతారు అని చిన్నప్పుడెప్పుడో చదివినగుర్తు! నిజంగా చూస్తే తన పరిస్థితి అల్లానేవుంది. "రెండో పెళ్ళి" అనగానే, తనకి వంటి నిండా నగలూ, జరీపట్టుచీరలూ, జ్ఞాపకానికొచ్చాయ్. వాటి వరసనే దగ్గుతూ, దగ్గుతూ భాధపడే అరవయియేళ్ళ భర్త కూడా నిలబడ్డాడు. కాని తను అనుకున్న దేదీ కాలేదు. వంటి నిండా నగలూ ఇంటినిండా జరీపట్టు చీరలులేవు. అరవయి ఏళ్ళ భర్తాకాదు! ఇరవయి నాలుగేళ్ళ యువకుడే భర్త. ఒక అత్తగారూ! చిన్నఇల్లూ! చిన్న ఉద్యోగం! ఈయనకి రెండోపెళ్ళి ఎందుకు చేయాల్సివచ్చిందో తన అత్తగారు

తనతో చెప్పలేదు; పెళ్ళిచేసిన తన తాతయ్యా చెప్పలేదు! చేసుకున్న భర్త మాత్రం "ఆమె చూడ తగ్గమనిషి కాదు! విన తగ్గగుణము కలది కాదు" అన్నాడు. అప్పుడు తనందానికి తనే మురిసింది. ఆ మురిపాల ముద్దుల మూటలే ఈ పంచ కన్యకలూ! అదేమిటో ఖర్మ! ఒక్క పిల్లకి తన పోలికే రాలేదు! అందరూ తండ్రి పోలికే! ఎత్తుగా వత్తుగా వుంటారు. అందం లేదు! చదువు అంటటం లేదు! ఎల్లా వీళ్ళని ఒకయ్య చేతిలో పెట్టాలో అర్ధంకావటంలేదు! కట్నాల గలగలల్లో వీళ్ళ రూపాల్ని దాయొచ్చు అనుకుంటె, ఇంట్లో "కాసీ" నిలవలేదు. "పిట్టను గొట్టా పొయ్యిలో పెట్టా!" అత్తగారు బహుదొడ్డమనిషి. చేయించు కున్నవాళ్ళు అల్లిబిల్లి అప్పాలు చేతిలో పెట్టి చాకిరీ చేయించుకుని, ఆమె దారిన ఆమె వెళ్ళిపోయారు. ఎలా ఈ సంసార సాగరాన్ని ఈదుకు రావాలో్న అర్థం కావటంలేదు. పిల్లలా తెలివైన వాళ్ళు కారు. అంటే వెర్రివాళ్ళని కాదు. ఈ కాలపు పిల్లల కుండా ల్సిన లక్షణాలు లేవు. అదే మరొకళ్ళు అయితే ఈ పాటికి ఎవర్నో ఒకర్ని ప్రేమించి పెళ్ళాడేద్దురు. వీళ్ళకి ఆ విజ్ఞానం కూడా లేదు. అక్కడికి ఎందుకైనా మంచిదని వీధరుగు మీదున్న చిన్న గదిలోని సామాన్లు అన్నీ అటక మీద పడేసి, కాలేజీ స్టూడెంట్లకి అద్దెకిచ్చింది. వాళ్ళు నూతిదగ్గర స్నానం చేస్తోన్నప్పుడల్లా ఏదో వంకని, నాయుకినో, తింగానో్న, అంబుజానో్న, పంపుతుంది. కాని ఏంలాభం? వీళ్ళని చూడగానే ఆ కుర్రాళ్ళు అపర శ్రీరామచంద్రుల వారిలా, కాస్త కన్నెత్తి చూస్తేనే పన్నెత్తి పలకరిస్తేనే

వాళ్ళ ఏకపత్నీ వ్రతం భంగపడేట్లు ప్రవర్తిస్తారు. బుద్ధిమంతులు. అక్కడికీ తను ధనుస్సు చేస్తోన్న నెలరోజులూ వాళ్ళకి ప్రసాదం పెట్టుతోనే వుండేది. అంతాతిని ఏటికేడాదీ తిని మంచిగా మాట్లాడుతూన్నట్లే నటించి ఒక శుభ ముహూర్తాన్న అయిదు వేల కట్నంతో ఒక "కాకిపిల్ల"ని కట్టుకొచ్చి వేరే కాపురం వున్నాడు పొరుగింట్లో మాణిక్యవేలు! వాడన్నయ్యా వడివేలు పెద్ద బిరుదు తెచ్చుకున్నాడు వయొలిన్ వాద్యానికి. ఇంకా పెళ్ళి పేరంటం లేదు. వసుంధరని వెంటేసుకుని తిరుగుతున్నాడు. వాళ్ళ మధ్య అక్రమ సంబంధమేమీ లేదంటాడు మాణిక్యవేలు. లోగుట్టు పెరుమాళ్ కెరుక! వసుంధర తన సవతి అని మాణిక్యవేలుతో తనెప్పుడూ చెప్పలేదు. అసలు అందరూ వసుంధర తన సవతి అని మర్చిపోయి వుంటారు. ఆమెని ఎల్లానో తమతో వుండేట్లు వొప్పిస్తే, వడివేలుకి నాయకిని ముడిపెట్టెయ్యొచ్చును. నలభయి ఏళ్ళు దాటివుంటాయ్ వడివేలుకి! అయితేం? బోలెడు ఆర్జిస్తున్నాడు. వొప్పుకోవాలి! పెరుమాళ్ళ దయవల్ల! తన దురదృష్ట దుర్భర జీవితంలో, ఈ పిల్లలే ఆశా రేఖలు! వాళ్ళ జీవితాలని ఒక దరికి చేర్చాలి! తను కంటినిండా నిద్రపోవాలి చిన్నప్పట్నించీ అందమైనది, చురుకైనది అని పేరుపడిన తను నేల చింతకాయలు కాస్తూ కూర్చుంది. అనాకారిదీ, మొద్దుస్వరూపమూ అని నిత్యం వర్ణించేది తన అత్తగారు వసుంధరని. అల్లాంటి వసుంధర, తన భర్తచేత తిరస్కృతయైన వసుంధర, అన్నగార్లు ఆదరించని వసుంధర, ఈరోజు వేలు సంపాదిస్తో, ఆకాశంలో

పాలపిట్టలా పేరు ఎగిరిపోతూంటే నిత్యం తనచుట్టూ, పది మందిని త్రిప్పుకుంటూ జీవిస్తోంది. ఆమె తన భర్త క్రిందనే వుంటే, తనలాగే కూటికీ, గుడ్డకీ, ముఖంవాచిపోతూండును. ఆమె తన భర్త క్రింద వుంటే తను ఆయన్ని పెళ్లాడవలసిన అవసరం రాకపోను. తన అందానికి, ఏ కలక్టరో, వరించ వచ్చును. అందమైన అమ్మాయిలకు పెళ్ళికాదనే భయం వుంటుందేమిటి? ఆరోజుల్లో తాతయ్య భయంకొద్దీ జ్ఞానమాణి అడిగీ అడగ్గానే, ఈయనకిచ్చి పెళ్ళిచేశారు. అంతా తెలుగు ట్యూటరుగారి భార్య అప్సరస అని ఆ రోజుల్లో చెప్పుకుని ఆనందించినవారే కాని ఆనందించని వారులేరు. ఇంతకీ తన ఖర్మ ఇలావ్రాసి పెట్టాడు పెరుమాళ్ళు. ఇంక ఇప్పుడు తన కర్తవ్యం ఈ పిల్లల్ని పైకితీసురావటమే. తనలో ఏం మిగిలి లేదు. ఇంకా, ఈయనగారు రాలేదే? కొంపతీసి ఆమె వెన కాతల తాళంవేస్తూ వెళ్ళిపోయారేమో! తన పిచ్చికాని, అంతగా దూషించి బయటకు గెంటేసిన భర్తనీ సవతి పిల్లల్నీ ఆమెఆదరిస్తుందా? లోకంలో ఎక్కడన్నా వుందాక తను ఆర్జించిన ఆర్జన సవతి పిల్లలకీ, తన సుఖాలన్నీ దూరం చేసిన సవతి పిల్లలకి ఇస్తుందా! కల్లోనివార్త! కాకపోతే, ఆయన వెంటవస్తేతీసుకుపోతుంది. అవును. తప్పకుండాఅల్లానే చేస్తుంది. ఆయన తన్ని ఎన్ని బాధలు పెట్టినా ఎంతగా అవమానపర్చినా, ఆయనతో వుంటం వల్ల ఆమెకొక విశేష గౌరవం వుంటుంది. ఇంక ఈయన తన సంసారంతో వేగ లేకుండా వున్నారు. ఆమె దగ్గరుంటే, కాలుమీద కాలు వేసుకుని దర్జాగా కష్టపడకుండా కాలం గడిపేయొచ్చును

అంచేత నిశ్చింతగా ఆమెరమ్మంటే వెళ్ళిపోతారు. అయ్యో! ఎంత తెలివితక్కువది తను? చేతులారా అప్పగించేసిందన్న మాట! ముందాలోచనలేదు తనకి. ఇంతకీ డబ్బుకాపీనం తప్ప ఏం జరుగుతుందో, అన్న విచక్షణా జ్ఞానం తనలో శూన్యం. ఏమో! ఆమె మాత్రం స్త్రీ కాదా? తనకి అలభ్యమైన, ఆనందం, తను ఏ ఆనందం కోసం అలమటించి పోతుందో ఆ ఆనందం, సాటి స్త్రీనించి పూడలాక్కుంటుందా? తన వుసురు ఆమెకి తగలదా? పిల్లలతల్లి యొక్క ఆక్రందన ఆమె శరీరాన్ని వుడికించి వేయదా? స్త్రీయొక్క సంసారిక బాధనీ తాపత్రయాన్ని అర్థం చేసుకోలేకపోతే, ఇంక పురుషులు తమని అర్థం చేసుకోలేదని గోలెత్తటంలో అర్థం ఏముందీ!"

చూడికుడు త్తమ్మ మల్లగుల్లాలు పడుతూంది. కిటికీ లోంచి, వర్షం ధారలు ధారలుగా కారుతూ జలతారు దారాల్లా కనపడుతోంది. అప్పుడొకకారూ, ఇప్పుడొక కారూ జర్రుమంటూ, బర్రుమంటూ, నీళ్ళు చిమ్ముకుంటూ పోతున్నాయ్. వెళుతున్న ప్రతీ కారూ తమ ఇంటి ముందరే ఆగుతున్నదనీ, అందులోంచి తన భర్తా, కూతురు, వసుంధరా దిగుతారనీ ఎదురుచూడసాగింది చూడికుడు త్తమ్మ. ఆమెలోని మాతృత్వపు మహోన్నత కాంక్ష తడిసిపోతూన్న వర్షంలో చినిగిన కాగితపు తూరీగలా ఎగురుతూంది.

వసుంధర "రాధికాక్రిష్ణా, రాధికా తవవిరహే కేశవా" అన్న అష్టపదిని పాడటం పూర్తి చేసింది. అష్టపదిని కొందరు 'మోహన' లోను కొందరు 'కానడ'లోనూ పాడే

వారు. వసుంధర పల్లవి కమాసులో మొదలు పెట్టి అన్నీ తలూక రాగంలో పాడి అంకితం షణ్ముఖప్రియతో పూర్తి చేసింది. ఎవరో ఒక "భావగీతమైనా పాడాలి." అని చీటి పంపేరు. సాధారణంగా కర్ణాటక సంగీత గాయకులు, వర్ణం రాగం, తానం, పల్లవి కీర్తనలు జావళీ తిల్లాన వరసక్రమంలో పాడుతాడు. ఈ మధ్యన పాడేవాళ్ళు, కబీర్, తులసీదాస్, మీరా, సూరదాస్ మున్నగువారి భజన్స కూడా పాడుతున్నారు. రామానుజం చేతికిచ్చిన "లిస్ట్"లో ఆఖరున "బీత్ కయో దిన్ భజనబినా రే" అన్న కబీర్ భజన వ్రాసివుంది. రోజు లన్నీ భగవద్భక్తి లేకుండానే గడిచి పోతున్నాయన్న ఆవేదనాపూరిత నివేదన ఆ గేయం వసుంధర ఎదరకు చూసింది. స్టేజిముందర వడివేలు తమ్ముడు మాణిక్యవేలు నించున్నాడు. వడివేలు తమ్ముణ్ణి స్టేజి మీదకు పిలిచాడు.

"వొక్కడివే వొచ్చావా!" అని అడిగాడు.

"అవును! ఆవిడ పుట్టింటికి వెళ్ళింది. పెళ్లికయినా వస్తావనుకున్నాను. ఎందుకని రాలేదు?"అన్నాడు మాణిక్యవేలు.

"తీరికలేదు! ఆ సమయానికే త్యాగబ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి." అంటూ వసుంధరకేసి చూసి,

"తమ్ముడు మాణిక్యవేలు!" అని పరిచయంచేశాడు.

"అల్లాగా! కులాసాగా వున్నావా? పదేళ్ళ పిల్లాడప్పుడు చూశాను. మళ్ళీ ఇప్పుడు చూశాను." అన్నది వసుంధర.

మాణిక్యవేలుకి వసుంధర తమవూరిదని తెలుసును. కాని అప్పాదొరై భార్య అని తెలియదు.

"ఏదీ! అప్పట్నుంచీ మీరిటు కేసి రాకపోతిరి. ఎట్లా చూస్తారు? రాఘవేంద్రంగారు కూడా అదే అనేవారు _ మన వూరిలో పుట్టి పెరిగిన ఆమె అయ్యుండీ కూడా ఆమె ఎప్పుడూ ఇక్కడ ప్రోగ్రాంస్ ఇవ్వటానికి ఒప్పుకోరు, అని ఆయన ఎంతో బాధపడేవారు. ప్రతీ దసరా గాన సభలకీ, మమ్మల్నడిగి లేదనిపించుకోకుండా డిసైడ్ చేసేవారు కాదు. ఇన్నాళ్ళకి మీకు మన నగర ప్రజలమీద అభిమానం కల్గింది!" అన్నాడు మాణిక్యవేలు.

"శ్రుతిని పరిచయం చెయ్యవా?" అంది వసుంధర "లేదు! పుట్టింటికి వెళ్ళింది. మీగానం వినే అదృష్టం వుండొద్దూ దానికి? ఎప్పుడూ ఎక్కడికీ రాని, సంగీతం అంటే సుతరామూ ఇష్టం లేని అప్పాదొరై కూడా వొచ్చాడు."

మాణిక్యవేలు ధోరణిగా తన భార్యయొక్క, సంగీతాభిరుచి గురించి చెప్పుకపోతున్నాడు.

"ఆయన వొచ్చారన్న చూట !"

కోపం, దుఃఖం, జల్లుమనిపించాయి_వసుంధర శరీరాన్ని అవ్యక్తభాధతో. ఆమె హృదయం కుమిలి పోసాగింది, ఇరవయి ఏళ్ళ తర్వాత. తను పుట్టి, మెట్టిన వూరికి రావడంలో వున్న ఆనందం ఆమెలో నిబిడీకృతమైన అజ్ఞాత వేదన తిరగతోడింది, ఆ కుమిలింపులోనే.

మరోక పాట అడగటానికి అవకాశ మియ్యకుండానే "మంగళం మారమణనిగె, జయమంగళం మారమణనిగె" అన్న సురటిరాగ మంగళహారతి ఎత్తేసుకొంది. హాలంతా కలకల్లాడుతూ ఉద్వేగంగా లేచిపోయారు. పెద్దా, పిన్నా, ఆడా, మగా, అన్న వివక్షత లేకుండా అందరూ స్టేజ్ దగ్గర గుంపుకూడారు. వసుంధర కాళ్ళు వణుకుతున్నాయ్. ఏదో అనిశ్చిత భయం ఆమెని ఆవరించింది. ఎలానో నిలవరించుకుని లేచి, అందరకూ తలవంచుకుని, రెండు చేతులూ జోడించి నమస్కారం పెట్టింది. అప్పారావు గేట్లోకి వెళ్ళి నించున్నాడు. స్టేజ్ మీద ఆమెని కలుసుకుని మాట్లాడేందుకు చిన్నతన మనిపించింది. నాయకి, వెళ్ళి మాట్లాడాలనుకుంది. కాని, జయలక్ష్మి "కళ్ళు కూరుకు పోతున్నాయే బాబూ! నీ కంతగా ఆమెతో మాట్లాడాలని వుంటే ప్రొద్దుట ఆమె బస చేసిన చోటకి తీసుకవెళ్తాను" అంది.

అది సబబుగానే తోచింది నాయకికి. బసలో అయితే శాస్త్రీరిగ్గా తమ కుటుంబ విషయాలు మాట్లాడుకోవచ్చును.

"అయితే ఆమె ఇంకా వుంటారా?"

"వుండక? రేపు రక్షణనిధికి, జూబ్లీ హాలులోనూ, అశోక లైబ్రరీ భవన నిధికి, చంద్రా మాన్షన్సులో నాలుగో తారీకునా ఆమె ప్రోగ్రాంస్ వున్నాయి. ఇంకా గవర్నమెంట్ కాలేజీ, ఆర్ట్సు అసోసియేషన్ వాళ్లు సన్మానాలు చేస్తారుట వెంకటేశ్వర హాలులో! ఇంకా వారం పదిరోజుల దాకా గుక్కతిప్పుకోలేనన్ని కార్యక్రమాలు. ఈ చుట్టు

ప్రక్కల అయిదారు వూళ్ళల్లో వున్నాయట. అందాకా చంద్రా మాన్షన్స్‌లో వుంటారు" అన్నది జయలక్ష్మి. మాట్లాడకుండా నాయకి జయలక్ష్మితో రిక్షా ఎక్కేసింది.

జనం ప్రవాహంలా కదులుతున్నారు. ఆ ప్రవాహాని కతీతంగా స్థాణువల్లె నించున్నాడు అప్పాదొరై! వర్షం వెలిసినట్లుంది! చిక్కటి చీకటిముద్దల్లావున్న మేఘాల కద లిక ఆకాశంలో అస్పష్టంగా కనబడుతున్నాయ్. రోడ్డు కావలవున్న చెట్ల గుబుర్లలోని మిణుగురు పురుగులు, పులుకూ పులుకూ మెరుస్తున్నాయి. అంతటినిశిరాత్రిలోనూ, వర్షపుచలిలోనూ, రిక్షావాళ్ళు ప్లాస్టిక్ కాగితం చొక్కాలు తొడుక్కుని హాలు బయటనించున్నారు. జనం వర్షపురాత్రి అవటంనుంచి, అట్టే బేరాలాడకుండా రిక్షాలు ఎక్కిపోతు న్నారు.

ఎన్నో రకాల ప్రశంసలు, ఆకాశంలోకి ఎగురు తున్నాయి. అప్పాదొరై అద్భుతపడ్డాడు. అందరూ ఆమె గానాన్ని రకరకాల ప్రశంసలతో ఆకాశానికెత్తేవారేకాని, ఒక్కరూ ఆమె అంతరంగిక జీవితంగురించి ప్రస్తావించటం లేదు. అప్పాదొరై "ఆఁ! దానిదేముంది? అందరూ ఆమె గానంకోసం వచ్చినవాళ్ళవటంనించి, ఆ గానం వాళ్ళకి నచ్చినదవటంనించి, ఆమాటలే, ఆ గానాన్ని కూర్చిన ప్రశంసలే మాట్లాడుకుంటున్నారు, మామూలువాళ్ళకి, ఆమె భర్త వొదిలేసిన స్త్రీయని తెలియకుండా వుంటుందా? ఎంత గొప్ప ప్రసిద్ధిచెందిన గాయనీ మణియైపోయినా, ఆ

చెడ్డపేరు 'భర్త వొదిలేశాడు' అనే పేరు పోతుందా? తెగిన గాలిపటంలా, గాలి వాటుకి ఆకాశంలో విహరిస్తోన్నా ఎప్పటికయినా నేలవ్రాలాల్సిందే కదా !" అనుకున్నాడు. అతని మనస్సు ఎందువల్లనో వసుంధర ఉన్నతిని సహించ లేకపోతోంది. ఏదో కచ్చగా వసుంధరని ఎదురొకుని, నాలుగూ కడిగేద్దామన్న దురూహ అతనిలో పాలుపోసు కుంటోంది. జనం పల్చబడ్డారు. వెనకగా, వసుంధర, రామానుజం, విమలాదేశికన్, వడివేలు, అయ్యాప్పిళ్ళె, 'చంద్రా మాన్షన్స్' యజమాని వాసుదేవన్ వస్తున్నారు. మాణిక్యవేలు, అంతదూరంనించే అప్పాదొరై గేట్లోనించో టంచూసి;

"అదుగో! వారు నిలుచోనున్నారు. నాకోసమే అయ్యుంటుంది" అన్నాడు. వసుంధర చూసింది. కాలు ముందుకు సాగలేదు. అయినా మొండిగానే కదుల్తోంది. మాణిక్యవేలు, గబగబా, అప్పాదొరైని సమీపించేడు.

"కాస్త తాళుకో! వాళ్ళు వస్తూన్నారు. ఆమెని పరి చయంచేస్తాను" అన్నాడు. అనుకోని సంఘటనకాదు అప్పా దొరైకి! మాణిక్యవేలు పరిచయం చెయ్యకపోయినా, కల్పించుకు మాట్లాడాలనే వుద్దేశ్యంలో వున్నాడు. వాళ్ళు సమీపించగానే, "ఇతను మాపొరిగింటాయన అప్పాదొరై! కాలేజీలో తెలుగు ట్యూటరు!" అని పరిచయంచేశాడు. మాణిక్యవేలు వసుంధర తక్క మిగిలినవారందరూ నమ స్కారాలు చేశారు. వసుంధర మౌనంగా నించుంది.

"నీతో మాట్లాడాలని వించున్నాను" అన్నాడు అప్పాదొరై.

"ఇక్కడ!" అంది వసుంధర.

అప్పాదొరై ఏకవచన ప్రయోగానికి అందరూ విస్తుపోయారు. 'ఆమె ఈ వూరిలో పుట్టి పెరిగింది. అంచేత అతనికి ఆమె, తెలిసుండొచ్చును' అని సమాధాన పడ్డారు. వారిరువురి ఆంతరంగిక జీవితం వాళ్ళకి తెలీదు.

"ఇంటికి! రా" అన్నాడు అదొకరకంమందలింపుగా. తీక్కగా ధ్వనించింది గొంతు.

వసుంధర హృదయం వుడికిపోయింది. అదే గొంతు, ఇరవయి ఏళ్ళక్రితం తనతో సహా అగ్ని ప్రదక్షిణ చేస్తూ పవిత్ర మంత్రాలు చదివింది. అదే గొంతు 'నీ ముఖం నాక్కనబడకూడదు. ఇంట్లోంచే పో! నీకు దిక్కున్నచోట చెప్పుకో!' అని గర్జించింది ఎందుకని?

వసుంధర తండ్రి ఇల్లు అమ్మేశాడు. ఆరువేల రూపాయ లొచ్చాయ్! అప్పు తీర్చేసి, మిగిలిన డబ్బు పుచ్చుకుని తీర్థయాత్రలకి వెళ్ళిపోయాడు. జ్ఞానమణి జ్ఞాననేత్రం విప్పి చూసింది. 'ఏం, కొడుకులు పెట్టకపోయినంత మాత్రాన్న దిగడిందా? ఆ నాలుగు డబ్బులూ ఏ బ్యాంక్ లోనో వేసుకుని, నీ దగ్గరుండకూడదా!' అన్నదికోడలితో.

"ఆయనిష్టం! నే చెప్పితేవింటారా?" అంది. ఆయన డబ్బుమీద తన అత్తగారికి అపార ప్రేమని తెలుసును వసుంధరకి.

"ఎందుకు వినరు! మనకి మటుకు జమీలు దొర్లిపో తున్నాయా? ఆ నాలుగు రాళ్ళూవుంటే, నగో నట్రో చేయించి పడేస్తే తీరిపోలా? పీనాసి వెధవ! ఏం, కట్టుక పోతారా ఏం?"

తన్నీ మొన్నీ అన్నా మౌనంగా భరాయించేది వసుంధర. కాని తల్లిలేని తన్నీ, అన్నలకి అప్పచెప్పితే, ఏం బాధలు పెట్టుతారో అని, తన్నీ తల్లీ తండ్రీకూడా తనే అయి పెంచి వీళ్ళు అడిగిన కట్నాన్నీ లేదనకుండా ఇచ్చిన తండ్రిని, అత్తగారు నిందిస్తోంటే వినలేకపోయింది.

"ఆయన డబ్బు ఆయన ఇష్టంవొచ్చినట్లు చేస్తారు. మీా కెందుకని? మీాకివ్వాల్సినది ఇచ్చారుకదా! ఇంకా ఎందుకని తిట్టారు!" ఉక్రోషంతో అనేసింది వసుంధర.

"వుత్తినే ఇచ్చాడా ఏమిటి! మూాడు వేలన్నా లేందే నీ మొద్దుముఖాని కెవరు వస్తారు పెళ్ళాడదామని? సిగ్గులేక పోతే సరి! నలుగురు దున్నపోతుల్లాంటి అన్నలుండీ ఒకనా డన్నా, ఒక గుడ్డముక్క పెట్టారా?" సాగదీసింది జ్ఞానమణి. భర్త కిష్టంలేని భార్య ఇంట్లో అందరికీ లోకువే!

"మూాడు వేలతో నా మొద్దుముఖం, ముద్దుముఖంలా మారిపోయింది గాబోల్ను!" వెనకాతల నించున్న అప్పా దొరైని చూడలేదు వసుంధర. ఆవేశంగా అనేసింది.

అప్పాదొరై తెలుగు పండితుడు. అందులో శ్రీనాథ పండితులవారి పద్యాలన్ని కంఠస్థము చేశాడు. అతని శృం గార రస రాజ్యాభిషిక్తురాలు కావల్సిన అర్హతలు, వసుం

ధరలో లేవు. వసుంధర పొట్టిగా పీలగావుండేది. కొద్దిగా పళ్ళుయెత్తు, సన్నని కళ్ళు, ఒక చాయ నలుపే అనొచ్చును. అనొచ్చు నేమిటి నలుపులో లెక్కే! వసుంధరవల్ల అతని శృంగారతృష్ణ తీరదని, అతను పెళ్ళిరోజునే నిర్ణయించుకున్నాడు—అందుకని.

"మూడు వేలు కాదు. ముప్పయ్ వేలు నోట్లల్లో నిన్ను కప్పెట్టినా నీముఖాని కందంరాదు. తెలుసా!" విసురుగా అన్నాడు. వసుంధర మాట్లాడలేదు. నిలువునా చూశాడు అప్పాదొరై. మాసినకలనేతచీర, మసిబారిన చేతులూ, ఏడుపు కొట్టు ముఖం! ఛీ! ఛీ! అసహ్యం పుట్టింది.

"ముష్టి మూడు వేలకి ఈ ముండ రాజ్యంచేయటాని కొచ్చింది కాబోలు్ను! నా ఇంట్లో వుండక్కర్లేదు. నీముఖం నాకు చూపెట్టకు - పో బయటికి! నీకు దిక్కున్నచోట చెప్పుకో!" గర్జించాడు అప్పాదొరై!

అత్తగారివెంపు చూసింది వసుంధర.

"క్షమించండి! చిన్నప్పట్నించీ ఎలా మాట్లాడాలో తెలియదు. తల్లిలేని పిల్లని నా కెవరు నేర్పుతారు?"జాలిగా అంది వసుంధర.

"ఇందాకటివించిమీవాళ్ళు నేర్పినవే అంటున్నావా! మంచిమనిషి కోమాట—మంచి పశువుకో దెబ్బ! బుద్ధితెలుసుకుని మాట్లాడు!" అన్నది జ్ఞానమణి, పెద్దరికంగా.

తల్లి మొత్తబడుతుందేమో అన్న అనుమానం కలిగింది అప్పాదొరైకి.

"అమ్మా దీని పోషణ బాధ్యత నువ్వు తీసుకుంటావా చెప్పు!" అన్నాడు.

"ఏదో పోనిద్దూ చిన్నతనం" అనునయంగా అన్నది జ్ఞానమణి.

కోపం, దుఃఖం, అసూయ, ఎదుటవాళ్ళు సముదాయించినకొద్దీ ఎక్కువవుతాయి. అప్పాదొరైలోని తీరని అందాలదాహం, ఖస్సుమని లేచింది.

"నీకు పెద్దతనం! దానికి చిన్నతనం! ఇంక మధ్యని నేనే మట్టికొట్టుక పోవాల్సినవాణ్ణి. ఏమయినాసరే; నువ్వు నా కళ్ళపడకుండా పో! నీ దరిద్రపు మొఖాన్ని చూస్తూ నేనీ ఇంట్లో తిరగలేను! ఇంక నన్ను చంపకు!"

వసుంధరకి భర్తఅంటే ఈ నాలుగయిదు నెలల్లోనూ అనురాగం కురిసిపోయిందేమీ లేదు. ఆ ఇంట్లో ఆమె అత్తగారి సహాయకురాలిగా మాత్రమే స్థానం సంపాదించుకున్నది. ప్రకృతిసిద్ధంగా ఆమె హిందూ వనితయై వున్నందుకు, భర్తృ తిరస్కారంవల్ల చాలా బాధపడింది. ఎన్ని అన్నా మూగగా భరించింది.

వసుంధరకి తన ఇల్లాలితనం వెగటుగా తోచింది. పెళ్ళయినది మొదలు భరిస్తోంది. ఒక మంచిమాట లేదు, తనేదో త్యాగంచేసినట్లు డబ్బావాయించుకోవటం తప్పిస్తే! పోనీ తన కడుపు ఫలించిందా అంటే అదీ లేదు! ఇంక దేనికని వీళ్ళ అవమానపు చర్యలని సమర్ధించుకుంటూ కాలం

గడపటం! సీత, సావిత్రి అంటే వాళ్ళకి భర్తల అనురాగ ముంది కనుక, కష్టాలెన్నైనా భరించారు. అప్పాదొరై లాంటివాళ్ళయితే, ఏం చేద్దురో! ఒకళ్ళ మంచితనం, బుద్ధిమంతతనం, నలుగురూ గమనించేట్టు వుండాలంటే, వాళ్ళ పరిసరాలుకూడా, మంచితనంతో నిండివుండాలి. అయినా ఆఖరు ప్రయత్నంగా అంది వసుంధర.

"నావల్ల తప్పులేమైనా జరిగివుంటే మన్నించండి, నాకు తల్లో? తండ్రో! ఎక్కడికి పోతాను?"

"నీ ఇష్టంవొచ్చినచోటికి పో!"

ఆ వెళ్ళటం, వెళ్ళటం అన్నయ్యల దగ్గరకి వెళ్ళకుండా చిన్ననాటి సంగీతం మాష్టరు కోదండయ్యగారి దగ్గరకు వెళ్ళింది. వసుంధర అన్నయ్యలు ఆదరించరని తెలుసు. వాళ్ళకి వసుంధర ఎప్పుడూ కంట్లోనలుసే! తండ్రి ప్రైవేట్లు చెప్పుకుంటూ బోలెడు ఆర్జించాడనీ, అది అంతా వసుంధర కిచ్చేశాడనీ వాళ్ళ నమ్మకం!

కోదండయ్యగారు అంతా విన్నారు.

"ఒక్కొక్కళ్ళని ఒక్కొక్కలా జీవించమని సృష్టిస్తాడు తల్లీ, భగవంతుడు! నీ గొంతులో అపూర్వనాదం వుంది, అది సార్థకపరుచుకో తల్లీ!

'ఏకం సంగీత విజ్ఞానం—చతుర్వర్గ ఫలప్రదమ్' అన్నారు పెద్దలు. నీ గానం అమరమవుతుంది. అందుకే, నీకీ సంసార విచ్ఛేదన లభించింది" అన్నారు కోదండయ్యగారు. ఆయనే మద్రాసులో వీణ కుప్పయ్యర్ వంశీకులైన రామస్వామిఅయ్యర్ గారికి వసుంధరని అప్పగించేరు. వడి

వేలుకూడా ఆ సమయంలో అక్కడ వయొలిన్ నేర్చుకునే వాడు. ముందు ముందు కొద్దిగా ఇరుగూ పొరుగూ అమ్మాయిలకి సరిగమలు, గీతాలూ నేర్పి, అయిదూ పదీ సంపాదించుకునేది వసుంధర, క్రమక్రమంగా అక్కడక్కడా కచ్చేరీలు చేయటం ప్రారంభించింది. దానికి వడివేలు వో త్తిడి ఎక్కువ కారణం అనోచ్చును. వడివేలు తనని ఎక్కడ వయొలిన్ వాయించమన్నా వసుంధర గాత్ర మాధుర్యాన్ని వర్ణించి చెప్పేవాడు. అలా అలా పాప్యులర్ అయిపోయింది. కాస్సేపు ఆలోచించింది వసుంధర.

"మమ్మీ! ఏమిటి ఇక్కడ్నే నిలబడిపోయారు?" అన్నాడు వాసుదేవన్.

ఆ! మీరుకూడా రండి!" అన్నది అప్పాదొరైనుద్దేశించి.

అప్పాదొరై మారు మాట్లాడకుండా వసుంధరతో కారెక్కేశాడు. వాసుదేవన్ డ్రైవరు సీట్లో కూర్చుని కారు స్టారుచేశాడు. వేరొక కారులో విమలా దేశికన్, అయ్యాపిళ్ళె, వడివేలు, రామానుజం, తంబురా, వయొలిన్, మృదంగం వాయిద్యాలు పెట్టుకుని కూర్చున్నారు.

"చంద్రా మాన్షన్" చాలా పెద్దభవనాలతో నిండి వుంది. నాలుగు వెంపులా నాలుగేసి అంతస్థులున్న పెద్ద మేడలు! చుట్టూ పెద్దపెద్ద వృక్షాలు! మధ్యన వాసుదేవన్ తాతగారైన రావుబహుద్దూర్ అశోకన్‌గారి పెద్ద శిలా విగ్రహం! దానిముందర పౌంటెన్! చుట్టూ పూలతోట! ఒక మేడ క్రిందిభాగంలో, ప్రెస్ వుంది. ఒక వెంపు

మేడలో, నృత్య కళాశాలవుంది. ఒక పెంపుమేడలో, క్రింది భాగంలో వాసుదేవన్ ఫామిలీ వుంటోంది. వాసుదేవన్‌కి సంగీతం అంటే చాలా అభిమానం. అతని ఆర్థిక సహాయంతో నగరంలో చాలా సంస్థలు నడుస్తున్నాయి. అందులో లక్ష గ్రంథాలు సేకరించిన అశోక లైబ్రరీ వొకటి. దాని భవన నిధికి వసుంధర ప్రోగ్రాం పెట్టారు. ఆ ప్రోగ్రాం అయ్యేదాకా తమ అతిథులుగా వుండమని వసుంధర ట్రూప్‌ని ఆహ్వానించారు. వసుంధరకి కూడా వాసుదేవన్ పెద్దమనిషితరహా నచ్చింది. వాసుదేవన్ భార్యా, నలుగురు ఆడపిల్లలూ కూడా చాలా సంస్కారవంతులు. అంచేత వాళ్ళింట్లో వుండటం వసుంధరకు నచ్చింది. ఇంటికి రాగానే వాసుదేవన్ లోనికి వెళ్ళిపోయాడు. విమలా, అయ్యపిళ్ళ, వడివేలు, మాణిక్యవేలు, రామానుజం, ఎవళ్ళకిచ్చిన గదుల్లోకి వారు వెళ్ళి నిద్రాదేవతని ఆహ్వానించే ప్రయత్నంలో పడ్డారు. సుమతీ వాసుదేవన్ వొచ్చింది 'మూడు గంటలౌతూంది అప్పుడే! మమ్మీ! ఏమీ తీసుకోరా!' అంది.

"వొద్దమ్మా!" అన్నది వసుంధర.

సుమతి అవతలికి వెళ్ళిపోయింది. హాలులో వసుంధర ఒక సోఫాలో తను కూర్చుంటూ-

"కూర్చోండి." అన్నది, అప్పాదొరై నుద్దేశించి. అప్పాదొరై కూర్చున్నాడు.

పైన గిరగిర తిరిగే ఫాన్ వంక చూస్తూ-

"చెప్పండి!" అన్నది వసుంధర.

"చెప్పేందుకేముంది? నువ్వీ వూరు ప్రోగ్రామ్ ఇవ్వటానికొస్తున్నావని, నాకు నిన్ననే తెలిసింది. అంచేత వుత్తరం వ్రాసినా అందదుకదా అని వ్రాయలేదు."

"దేనికి?"

"అమ్మ చనిపోయింది తెలుసా?"

"వూఁ" అన్నది వసుంధర.

"మరి?" ప్రశ్నార్థకంగా చూశాడు.

"అందుకని రాలేదనా?"

"అవును."

"అప్పటికి మీరు ముగ్గురు పిల్లల తండ్రి వయివారని తెలుసు! అయినా అత్తగారు చనిపోగానే నేను రావటానికి, ఆమె అంతట ఆమె ఒక్కరే నన్ను వెళ్ళగొట్టలేదు కదా!" అన్నది.

"అప్పుడుకాదు! నువ్వు ఈ వూరు వస్తోన్నప్పుడు, మనింట్లో దిగకుండా, ఇక్కడదిగటం ఏం బాగుంది?"

"నేను వక్కర్తినీ రాలేదు కదా! ఎప్పుడూ అయిదారుగురు కూడా వుంటారు" అన్నది.

అహంభావం విన్పించింది అతనికి.

"రామానుజం ఎవరు?" అన్నాడు.

"దిక్కులేనివాడు. అనాథ శిశువు! వచ్చే కాలానికి ఆసరాగావుంటాడని పెంచుకున్నాను! నా కొడుకు అనుకున్నారా? కాదు!" తనమీద ఎలాంటి అపోహలుంటాయో తెలుసును వసుంధరకి.

అప్పాదొరై మాటాడలేదు.

"కాని, నా కొడుకు మల్లేనే పెంచుకున్నాను." దృఢంగా అన్నది మల్లి.

"ఏమయినా నువ్వు మనింటికి వొచ్చెయ్యటం మంచిది. గతంగతః! ఇంత పేరు తెచ్చుకున్నాక, ఇంకా, ఆ బ్లాక్ మార్కు వుండటం మెచ్చుకోతగ్గ విశేషం కాదు!" అన్నాడు అప్పాదొరై.

"ఏ బ్లాక్‌మార్కువల్ల నేనింత పేరు తెచ్చుకోగల్గే అవకాశం కల్గింకో, ఆ బ్లాక్‌మార్కుని మధ్యలో వదిలేసుకోవటం, అంతకన్నా మెచ్చుకోదగ్గ విశేషం కాదు!" అన్నది వ్యంగ్యంగా.

"నానించి వచ్చిన కళంకం నానించే పోగొట్టాలని చూస్తున్నాను. ఇక్కడ్నించి నువ్వు మాతోనే వుంటం శ్రేయోదాయకం" అన్నాడు.

"మీరు పొరబడుతున్నారు 'భర్తారక్షతి యౌవనే' అన్నారు. ఆ దశ నాకు దాటిపోయింది. ఇంక కుమారుడు రక్షించాల్సిన దశలో వున్నాను. అందుకనే రామానుజాన్ని పెంచుకున్నాను. యౌవనదశలో నేను అరక్షణీయనై పోయాను. ఇప్పుడు మీ రక్షణ నాకనవసరం! గూటిలోంచి ఎగిరిన పిట్ట మళ్ళి ఆ గూటిలోనే నివాసం ఏర్పరుచుకుంటుందా? ఎప్పుడన్నా!"

"అయితే నువ్వు ఎగిరే పిట్టవన్నమాట!" కచ్చగా అన్నాడు అప్పాదొరై.

"అంత మంచి ఉపమానం తేకండి నాకు! పిట్టలు చాలా హాయిగా స్వేచ్ఛగా ఎగురుతాయి, ఆ హాయి నాకు లేదు. కొన్ని లక్షల సంశయాలవలలో బందీని నేను! ఎగురుతూన్నది నేనుకాదు. నాలోని అంతర్వేదన!"

"నీకు మంచిపేరు తెచ్చుకుని జీవిత చరమాంకాన్ని తేలిగ్గా గడుపుకుందామంటే, మా ఇంటికి రావొచ్చును. నా అభ్యంతరం లేదు– అని చెప్పుదామని వొచ్చాను" అన్నాడు.

"మీాకు అభ్యంతరం వుండదని నాకు తెలుసును. ఎందుకని వుండదో కూడా నాకు తెపును. వుండండీ వస్తాను" లోపలికి వెళ్ళింది వసుంధర.

అప్పాదొరై సంతోషపడ్డాడు. తమతో వుంటుం దన్నమాట! వుండక ఏం చేస్తుంది? పెద్దదైపోతోంది. రెండు చేతులా ఆర్జించింది. స్థిరత్వం అన్నది లేకుండా ఇంకెంత కాలం తిరుగుతుందీ! తమతో వుంటే, ఆమె జీవితం ప్రశాంతంగా గడిచిపోతుంది. తమ ఇంటిలోనే, ఒక సంగీత కళాశాల తెరవచ్చును. "చూడ" ఎంతో సంతోషిస్తుంది! "చూడ"ది ఎంత నిర్మల మనస్సు! కోర్కోరి పవతిని ఆహ్వానించకలుగుతోందంటే ఆమె సరళ స్వభావం ఎంతటిదో కొలవలేముకదా! దీనికి చిన్నప్పటినుంచీ అహంభావం. అమ్మ ఏదైనా అంటే బుస్సుమనిలేచేది! తనకే అసహ్యం వేసింది. "చూడ" మాత్రం తన తల్లి వుండగా కాపరంచెయ్యలేదా? ఏమన్నా అంటే గుడ్లనీరు గుడ్ల కుక్కుకుంటూ జాలిగా తనవెంపు చూసేది! అందం అంతా తనకర్పించి, అయిదుగు

రాడపిల్లలతో నిస్సహాయంగా నిలబడింది! దీనిలా "స్టేజ్" ఎక్కి తందనాలాడితే అదీ సంపాదించును లక్షలు! ఇప్పటికింకా తనెదురుపడితే లజ్జతో గన్నేరు మొగ్గ అయిపోతుంది "చూడ."

దీన్ని చేరదీస్తే, బొత్తుగా గాలికి వదిలేయకుండా ఆదరించే పుణ్యమూ దక్కుతుంది- తన నిర్ధనత్వమూ తీరుతుంది. ఒక దెబ్బకి రెండుపిట్టలు! ఒకవేళ అన్నగార్లు వచ్చి దీన్ని సముదాయించి లాక్కుపోతారేమో! అల్లా వెళ్ళదు! తనింట్లోంచి వెళ్ళగొట్టి తేనే అన్నల అండ చేరలేదు! అల్లాంటిది ఇప్పుడా! మర్యాద ప్రధానం కాని, డబ్బుందికదా అని ఎక్కడపడితే అక్కడ వుండటం సంఘం వొప్పుకుంటుందా? సంఘం పెట్టేబాధలు, అనే ఈటెపోటుల్లాంటి మాటలు పడలేకనే తను మాటవరసకు అనగానే వుండటానికి వచ్చేస్తూంది. అప్పాదొరై ఫాన్‌కేసి చూశాడు. గిరగిరా తిరుగుతూంది. పడివేలు గదిలోంచి సన్నగా వయొలిన్ వాద్యం వినపడుతోంది. అప్పాదొరై ఆలోచిస్తూ కూర్చున్నాడు. వసుంధర లోపలికి వెళ్ళి గంటకావస్తోంది- ఏం చేస్తోందా? అన్న అనుమానం పడేలోపునే వసుంధర తిరిగివచ్చింది. వచ్చింది వచ్చినట్లు తిరిగ్గా సోఫాలో కూర్చుంది.

"వెళ్దామా?" అన్నాడు అప్పాదొరై. రాత్రంతా నిద్రలేక పోవటంవల్ల అతని కళ్ళు కూరుకుపోతున్నాయి.

"ఎక్కడికి?" నవ్వింది వసుంధర.

"మనింటికి?" ధైర్యంగా అన్నాననుకున్నాడు అప్పాదొరై.

"మీ ఇంటికి అనండి! అదెప్పుడూ నా ఇల్లుకాదు ! ఇప్పుడు అవుతుందా! ఎప్పుడూ కాబోదు. అదే ఆలోచించాను ఇంతసేపూ! స్త్రీ సహజమైన చాపల్యం, మీరు పిలిచినదే తడవుగా మీతో వుండటాన్ని ప్రోత్సహించింది. కాని, ఆలోచనాశక్తి వెనక్కులాగింది. ఇన్నాళ్ళు అతకనిది ఇప్పుడు అతుకుతుందా? అనిపించింది. ఇంక పోతే మీరు చాలా ఇబ్బందుల్లో వున్నట్లు మాణిక్యవేలు చెప్పాడు. భగవంతునిదయవల్ల నేనేదో ఆర్జిస్తున్నాను. మీరు మొహమాటపడకుండా డబ్బు కావలసివచ్చినప్పుడు నాకు తెలియజేయండి, ఇస్తాను. ఇప్పుడు ప్రస్తుతం నాదగ్గర అయిదు వేలున్నాయి అవి ఇస్తాను. పట్టుకెళ్లండి. ఇంటికెళ్లాక, ఇంకా పంపిస్తాను. మీ పిల్లలకి శుభ్రమైన సంబంధాలు వెతికి పెళ్ళిళ్ళు చేయండి! మీకు నాదగ్గర మొహమాటంవొద్దు" అన్నది వసుంధర! ఆమె ముఖం [illegible]రోన్మహత్వంతో వెలిగిపోతూంది.

అప్పాదొరై నిర్ఘాంతపోయాడు. ఇందాకట్నించీ తను ఆమె దిక్కులేక తిరుగుతూందనీ, అందుచేతనే ఆమె తన ఆశ్రయాన్ని ఆనందంగా స్వీకరి చుతున్నదనీ, అనుకున్నాడు. కథ తారుమారైంది.

"రావన్న మాట! మాతో వుండటం నీకిష్టంలేదన్న మాట!"

"మళ్ళీ! మళ్ళీ అడుగుతూ, నన్నూ నా మనసునీ, నీరసపెట్టకండి" అన్నది వసుంధర! ఆమె కళ్లు చెమ్మగిల్లాయ్ బాధతో!

కాకులు లేచాయి! లోకులు లేచారు! అప్పాదొరై లేచాడు! ఎగిరేపిట్టలు ఎగురుతున్నాయి! నాయకి కన్నె మనసున వలపు తలపులు ఎగురుతున్నాయి! చూడికుడుత్తమ్మను శంకలతో నిండిన, మాతృత్వపు మమకారము తెలిమబ్బులా ఎగురుతోంది.

ఆకాశం అంతా నవోత్సాహంతో చైతన్యవంతంగా ఎగురుతోన్న పిట్టలనీ, మబ్బులనీ, చూస్తూ, "చంద్రామాన్షన్" దాటి ఆరుమైళ్ళ దూరంలోవున్న గాంధీ నగరం కేసి, నడుస్తున్నాడు అప్పాదొరై!

"ఎగిరే పిట్టలా ఎగరాలని వుందీ!"

అంటూ కూని రాగంతీస్తూ హాల్లోకివచ్చింది విమలా దేశికన్. సోఫాలో కూర్చుని, కళ్ళు చీరచెంగుతో తుడుచుకుంటున్న వసుంధరనిచూసి, "రాత్రి నిద్రపోలేదామమ్మా. అయినా బొత్తుగా మూడయిపోయింది" అన్నది.

"నిద్ర పట్టలేదే అమ్మాయ్!" అంది వసుంధర.

"ఇవ్వాళ రాత్రి పదయ్యేసరికి ఆ పేద్దాం" అన్నది విమల.

ఆ పిల్ల హాసముఖాన్ని చూస్తూ, నిట్టూర్చింది వసుంధర.

—o—

కథా నిలయం
5319
శ్రీకాకుళం